www.vishalabharati.com
epaper:vishalabharati.com

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

సంపుటి:02 సంచిక:50, ఆదివారం, 10.12.2023



## మార్కెట్‌కు ఢోకా లేదు... కానీ అత్యాశ పడొద్దు

- కొత్త ప్రభుత్వం పనితీరుపై ఆధారపడిన రియల్ ఎస్టేట్
- అప్పటివరకు సర్దుబాటు దశలోనే రియల్ రంగం.
- ధరలు పడిపోకున్నా స్థిరంగా కొనసాగే అవకాశం
- అయితే అధిక రాబడి మాయలో పడొద్దని నిపుణుల సూచనలు

..మిగతా 3 లో

# కొలువుదీరిన మూడో అసెంబ్లీ






- ప్రొటెం స్పీకర్ గా వ్యవహరించిన అక్బరుద్దీన్ ఒవైసీ
- స్పీకర్‌తో కలిపి మొత్తం 101 మంది ప్రమాణం
- మొదట సీఎం రేవంత్ రెడ్డి, ఆ తర్వాత మంత్రులు
- కాంగ్రెస్ 61, బీఆర్ఎస్ 32, ఎంఐఎం 6, సీపీఐ నుంచి ఒకరు ప్రమాణం
- ప్రమాణస్వీకారం చేయని 16 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు మంత్రులు
- తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టిన 51 మంది ఎమ్మెల్యేలు
- డిసెంబర్ 14వ తేదీకి సభ వాయిదా

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణ మూడో అసెంబ్లీ కొలువుదీరింది. శనివారం ఉదయం 11 గంటలకు శాసనసభ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ.. ఎమ్మెల్యేల చేత ప్రమాణస్వీకారం చేయించారు. మొదట సీఎం రేవంత్ రెడ్డి, ఆ తర్వాత మంత్రులు భట్టి విక్రమార్క, సీతక్క, శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్ రావు ప్రమాణం చేశారు. అనంతరం ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు 61 మంది, బీఆర్ఎస్ నుంచి 32 మంది, ఎంఐఎం నుంచి ఆరుగురు, సీపీఐ నుంచి ఒకరు ఎమ్మెల్యేగా ప్రమాణం చేశారు. ప్రొటెం స్పీకర్‌తో కలిపి మొత్తం 101 మంది ప్రమాణం చేశారు.

**ప్రమాణం చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వీరే..**

రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, సీతక్క, శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్ రావు, చిట్టెం పర్ణికా రెడ్డి, మట్టా రాగమయి, పద్మావతి రెడ్డి, యశస్విని రెడ్డి, ఆది శ్రీనివాస్, ఆది నారాయణ, ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్, అనిరుధ్ రెడ్డి, మనోహర్ రెడ్డి, బాలు నాయక్ నేనావత్, చిక్కుడు వంశీకృష్ణ, విజయ రమణారావు, దొంతి మాధవరెడ్డి, గడ్డం ప్రసాద్ కుమార్, గడ్డం వినోద్, గండ్ర సత్యనారాయణ రావు, మధుసూదన్ రెడ్డి, బీర్ల ఐలయ్య, రామ్‌చందర్ నాయక్, కేఆర్ నాగరాజు, కే శంకరయ్య, కసిరెడ్డి నారాయణ రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, ప్రేమ్ సాగర్ రావు, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, కోరం కనకయ్య, రాజేశ్ రెడ్డి, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జయవీర్ రెడ్డి, లక్ష్మీకాంతారావు, మదన్ మోహన్ రావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, మల్ రెడ్డి రంగారెడ్డి, మందుల సామేల్, మేడిపల్లి సత్యం, తుడి మేఘారెడ్డి, మురళీ నాయక్ భుక్యా, మైనంపల్లి రోహిత్, నాయిని రాజేందర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, పటోళ్ల సంజీవ్ రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు, రాందాస్ మాలోత్, రేవూరి ప్రకాశ్ రెడ్డి, రేకులపల్లి భూపతి రెడ్డి, టీ రామ్మోహన్ రెడ్డి, వాకిటి శ్రీహరి, వెడ్మ బొజ్జు, వేముల వీరేశం, గడ్డం వివేక్, యెన్నం శ్రీనివాస్ రెడ్డి. సీఐపీ నుంచి కూనంనేని సాంబశివ రావు ప్రమాణం చేశారు.

**బీఆర్ఎస్ నుంచి..**

కోవా లక్ష్మి, లాస్య నందిత, పటోళ్ల సబితా ఇంద్రా రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, అనిల్ జాదవ్, అరికెపూడి గాంధీ, బండారి లక్ష్మారెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, చామకూర మల్లారెడ్డి, చింతా ప్రభాకర్, దానం నాగేందర్, సుధీర్ రెడ్డి, గంగుల కమలాకర్, గూడెం మహిపాల్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, కేపీ వివేకానంద, కాలే యాదయ్య, కాలేరు వెంకటేశ్, కల్వకుంట్ల సంజయ్, మాణిక్ రావు, మాధవరం కృష్ణారావు, మాగంటి గోపీనాథ్, మర్రి రాజశేఖర్ రెడ్డి, ముఠా గోపాల్, ప్రశాంత్ రెడ్డి, డాక్టర్ సంజయ్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, తెల్లం వెంకట్రావ్, హరీశ్‌రావు, విజయుడు.

**ఎంఐఎం నుంచి ఆరుగురు**

అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, జాఫర్ హుస్సేన్, కౌసర్ మెయినుద్దీన్,

..మిగతా 2 లో



# ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఫ్రీ జర్నీ షురూ



- అసెంబ్లీ ప్రాంగణంలో ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- 'చేయూత' కింద ఆరోగ్య శ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు
- 100 రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని వెల్లడి

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

అసెంబ్లీ ఎన్నికల వేళ ఇచ్చిన ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యానికి నిర్దేశించిన మహాలక్ష్మి పథకాన్ని, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచే చేయూత పథకాన్ని సీఎం శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఆరోగ్య శ్రీ లోగో, పోస్టర్లను ఆవిష్కరించారు. తెలంగాణ ప్రభుత్వం తరపున బాక్సర్ నిఖత్ జరీన్‌కు రూ.2 కోట్ల చెక్కును అందజేశారు. ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం అయ్యాక అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో.. ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, సీఎస్ శాంతికుమారి, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. 'నేడు తెలంగాణ ప్రజలకు పండగ రోజు. 2009, డిసెంబర్ 9న తెలంగాణ ప్రక్రియ ప్రారంభమైంది. తెలంగాణ తల్లి అంటే సోనియమ్మ రూపం కనిపిస్తుంది. నాది తెలంగాణ అని చెప్పే అవకాశం మనకు సోనియమ్మ ఇచ్చారు. ఇక్కడి ప్రజల కోసమే సోనియమ్మ ఆరు గ్యారంటీలను ఇచ్చారు. ఇవాళ ఆరు గ్యారంటీల్లో రెండు గ్యారంటీలను అమలు చేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది. మహిళలు ఈరోజు నుంచి రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చు'అని తెలిపారు. మరోవైపు మహాలక్ష్మీ స్కీమ్ రాష్ట్రవ్యాప్తగా అమల్లోకి రావడంతో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో మహిళలు, యువతులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు.



## రైతు భరోసా కింద 15వేలు ఎప్పుడిస్తరు?

- 500 రూపాయల బోనస్ తో ధాన్యం ఎప్పుడు కొంటారు
- వర్షాల్లో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి
- అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాజీ మంత్రి హరీష్ రావు

**హైదరాబాద్,విశాలభారతి:**

అధికార పక్షం అయినా ప్రతిపక్షం అయినా ఎప్పటికీ తాము ప్రజల పక్షాన నిలబడతామని మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు స్పష్టం చేశారు. రైతాంగమంతా కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తోందని ఆయన అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతు భరోసా (పంట పెట్టుబడి సాయం) కింద రైతుకు 15వేలు ఇస్తామని చెప్పారు.. ఎప్పుడు ఇస్తారో రైతులకు చెప్పాలని మాజీ మంత్రి హరీష్ రావు కోరారు. అసెంబ్లీ మీడియా

..మిగతా 2 లో



## తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియమ్మ

- బర్త్‌డే వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి
- డిసెంబర్9 తెలంగాణలో పండుగ రోజు
- గాంధీ భవన్‌లో ఘనంగా సోనియా గాంధీ బర్త్‌డే
- 78 కేజీల కేక్‌కట్‌చేసిన పార్టీ నాయకులు
- సీఎం , డిప్యూటీ సీఎం భట్టి కీలక వ్యాఖ్యలు



## ప్రొటెమ్ స్పీకర్‌గా అక్బరుద్దీన్

- అక్బరుద్దీన్ చేత ప్రమాణం చేయించిన గవర్నర్ తమిళి సై
- సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి హాజరు
- కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల చేత ప్రమాణం చేయించిన ఓవైసీ
- ప్రమాణ స్వీకారానికి దూరంగా ఉన్న బీజేపీ ఎమ్మెల్యేలు

**హైదరాబాద్, స్టేట్ బ్యూరో:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. సమావేశాలు నాలుగు రోజుల పాటు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో శాసన సభ ప్రొటెమ్ స్పీకర్‌గా చాంద్రాయణగుట్ట ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ ప్రమాణ స్వీకారం చేశారు. శనివారం ఉదయం 8.30 గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళి సై అక్బరుద్దీన్ చేత ప్రొటెమ్ స్పీకర్‌గా ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్ రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. అతంతరం రాజ్ భవన్ నుంచి నేరుగా అసెంబ్లీకి చేరుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికైన ఎమ్మెల్యేల చేత అక్బరుద్దీన్ ప్రమాణం చేయించారు. ఇప్పటివరకు అక్బరుద్దీన్ ఆరుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు.

కొత్త ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో శాసనసభ తొలి సమావేశాల్లో ప్రొటెం స్పీకర్‌గా ఎవరు వ్యవహరిస్తారనేది చర్చనీయాంశంగా మారింది. కొత్తగా ఎన్నికైన సభ్యులతో మొదటగా ప్రమాణ స్వీకారం చేయించి స్పీకర్‌ను ఎన్నుకునేంత వరకు ప్రొటెం స్పీకర్ బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. సాధారణంగా ఎక్కువసార్లు శాసనసభకు ఎన్నికైన ఎమ్మెల్యేను ప్రొటెం స్పీకర్‌గా నియమిస్తారు. ప్రస్తుతం అత్యధికంగా ఎనిమిది సార్లు ఎన్నికైన శాసన సభ్యుడిగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉండగా ఇతర సభ్యుల్లో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, దానం నాగేందర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆరుసార్లు ఎన్నికైన శాసనసభ్యులు ఉన్నారు. కాంగ్రెస్‌లో ఆరుసార్లు ఎన్నికైన ఎమ్మెల్యేలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావులు ఇద్దరూ మంత్రులుగా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో అక్బరుద్దీన్‌ను ప్రొటెం స్పీకర్‌గా ఎంపిక చేశారు. కాగా, ప్రొటెమ్ స్పీకర్ అక్బరుద్దీన్ ఎదుట తాము ప్రమాణం చేయబోమని బీజేపీ ఎమ్మెల్యేలు స్పష్టం చేసి అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించారు

# నిలకడగా కేసీఆర్ ఆరోగ్యం

- వాకింగ్ స్టాండ్ సాయంతో నడిపించిన వైద్యులు
- త్వరగా కోలుకోవాలని బీఆర్ఎస్ శ్రేణుల పూజలు
- ఆస్పత్రిలోనే మాజీ సీఎం కుటుంబసభ్యులు

**హైదరాబాద్,విశాలభారతి:**

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ క్రమంగా కోలుకుంటున్నారు. శుక్రవారం జరిగిన తుంటి ఎముక మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతం కావడంతో.. వైద్యుల పర్యవేక్షణలో ఆయన నడవడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ మేరకు శనివారం సాయంత్రం యశోద ఆసుపత్రి వైద్యులు రెండో రోజు హెల్త్ బులిటెన్ విడుదల చేశారు. ''కేసీఆర్ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉంది. ఆయన్ను నిత్యం వైద్య బృందం పర్యవేక్షిస్తోంది. బెడ్ మీద నుంచి లేచి నడవగలుగుతున్నారు. ఆర్థోపెడిక్, ఫిజియోథెరపీ వైద్యుల పర్యవేక్షణలో కేసీఆర్ నడుస్తున్నారు. ఆయన ఆరోగ్య పురోగతి పట్ల సంతృప్తిగా ఉన్నాం'' అని యశోద ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

పదేళ్ల పాటు తెలంగాణను పాలించిన కేసీఆర్.. అనారోగ్యం పాలవడంతో ఆయన అభిమానులతో పాటు పార్టీ శ్రేణుల్లో ఆందోళన మొదలైంది. ప్రమాదమేమీ లేదని డాక్టర్లు చెప్పినప్పటికీ త్వరగా కోలుకోవాలని బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ప్రార్థిస్తున్నారు. గురువారం అర్ధరాత్రి బాత్‌రూమ్‌లో కేసీఆర్ జారిపడటంతో ఆయన తుంటికి గాయమైన సంగతి తెలిసిందే. దీంతో హుటాహుటిన ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ నుంచి

..మిగతా 2 లో

## బీఆర్ఎస్ఎల్పీ నేతగా కేసీఆర్

- ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఎమ్మెల్యేలు
- కేసీఆర్ పేరును ప్రతిపాదించిన పోచారం

..మిగతా 2 లో



## మంత్రులకు శాఖల కేటాయింపు

- ఆర్థిక శాఖ భట్టి విక్రమార్కకు
- ఐటీ మంత్రిగా శ్రీధర్ బాబు

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
www.vishalabharati.com
epaper:vishalabharati.com
జనరల్ న్యూస్
vishalabharathi Telugu Daily
2
ఆదివారం,
10.12. 2023
హైదరాబాద్

# కొలువుదీరిన మూడో అసెంబ్లీ

మొదటిపేజీ తరువాయి

జుల్ఫికర్ అలీ, మహ్మద్ మాజీద్ హుస్సేన్, మహ్మద్ మోబిన్.

**ప్రమాణస్వీకారం చేయని 18 మంది**

తెలంగాణ మూడో అసెంబ్లీ కొలువుదీరిన సంగతి తెలిసిందే. 119 మంది ఎమ్మెల్యేలకు గానూ 101 మంది ఎమ్మెల్యేలు శనివారం ప్రమాణస్వీకారం చేశారు. మరో 18 మంది ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేయలేదు. ప్రమాణస్వీకారం చేయని వారిలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కేసీఆర్, మహేశ్వర్ రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, కడియం శ్రీహరి, కేటీఆర్, వెంకట రమాణా రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, పద్మారావు, పైడి రాకేశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, పాల్వాయి హరీశ్ బాబు, పాయల్ శంకర్, రామారావు పవార్, రాజాసింగ్ ఉన్నారు.

**తొలిసారి అసెంబ్లీకి 51 మంది**

ఇక అన్ని పార్టీల తరపున కలుపుకుని తొలిసారి అసెంబ్లీలో 51 మంది ఎమ్మెల్యేలు అడుగుపెట్టారు. ప్రమాణ స్వీకారాల తరువాత స్పీకర్ గా గడ్డం ప్రసాద్ కుమార్ నామినేషన్ వేశారు. అటు బీజేపీకి చెందిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాలేదు. ప్రొటెం స్పీకర్ గా అక్బరుద్దీన్ ఎంపిక చేయడంపై వారు సమావేశాలను బాయ్ కాట్ చేశారు. రెగ్యులర్ స్పీకర్ ఎన్నిక తరువాతే భాజపా ఎమ్మెల్యేలు ప్రమాణం చేస్తామని తెలిపారు.

**సభకు రాని కేసీఆర్, కేటీఆర్**

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆపరేషన్ కారణంగా సభకు రాలేదు. కేటీఆర్ కూడా సభకు రాలేదు. ఇక హరీశ్ రావు ఎమ్మెల్యే ప్రమాణస్వీకారం చేశారు. ఈసారి కాంగ్రెస్ నుంచి 64 మంది, బీఆర్ఎస్ నుంచి 39 మంది, బీజేపీ నుంచి 8 మంది, ఎంఐఎం నుంచి ఏడుగురు, సీపీఐ నుంచి ఒకరు గెలిచారు.

**మంత్రులకు శాఖలు కేటాయింపు**

రేవంత్ రెడ్డి వద్ద హోం శాఖ, మున్సిపాలిటీ, విద్య శాఖలు ఉంచుకున్నారు. మల్లు భట్టి విక్రమార్కకు ఆర్థిక శాఖ, విద్యుత్ శాఖ, దామోదర రాజనర్సింహకు వైద్య, ఆరోగ్యశాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఉత్తమ్‌కుమార్ రెడ్డికి సివిల్ సప్లై, నీటి పారుదల శాఖలు కేటాయించారు. సీతక్కకు పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్, ఉమెన్ వెల్ఫర్, శ్రీధర్‌బాబుకు ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాలు, కొండా సురేఖకు అటవీ శాఖ, దేవాదాయ, పర్యావరణ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి సమాచార శాఖ, రెవెన్యూ, హౌసింగ్, కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఆర్ అండ్ బీ, సినిమాటోగ్రఫీ, జూపల్లి కృష్ణారావుకు ఎక్సైజ్, పర్యాటక శాఖ, పురావస్తు శాఖ, తుమ్మల నాగేశ్వరరావుకు వ్యవసాయ శాఖ, చేనేత, అనుబంధ సంస్థలు, పొన్నం ప్రభాకర్‌కు రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ కేటాయించారు.

**గన్‌పార్క్ వద్ద కోలాహలం**

అసెంబ్లీ సమావేశాలకు ముందు బీఆర్ఎస్, బీజేపీ నేతలు గన్‌పార్క్ వద్దకు చేరుకొని అమర వీరులకు నివాళులు అర్పించారు. గన్‌పార్క్ వద్ద అమరవీరులకు నివాళులు అర్పించిన అనంతరం ఎమ్మెల్యేలు అమరవీరులకు నివాళులు అర్పిస్తూ నినాదాలు చేశారు.

**14వ తేదీకి సభ వాయిదా**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు తొలిరోజు విజయవంతంగా జరిగాయి. శనివారం ఉదయం 11 గంటలకే సభ ప్రారంభం కాగా... ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఆధ్వర్యంలో కొత్తగా ఎన్నికైన వారు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం సభను డిసెంబర్ 14వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రొటెం స్పీకర్ ప్రకటించారు.

# రైతు భరోసా కింద 15వేలు ఎప్పుడిస్తరు?

మొదటిపేజీ తరువాయి

పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన వారందరికి శుభాకాంక్షలు తెలిపారు. ధాన్యం ఇప్పుడే అమ్ముకోకండి.. మేం అధికారంలోకి వస్తున్నాం బోనస్ తో ధాన్యం కొనుగోలు చేస్తామని ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నేతలు చెప్పారు. అధికారంలోకి వచ్చారు. 500 రూపాయల బోనస్ తో ధాన్యం ఎప్పుడు కొంటారో చెప్పాలని మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. తుఫాన్ కారణంగా రాష్ట్రంలో కొన్ని చోట్ల ధాన్యం తడిసిందని, రైతులు నష్టపోయారని, వారిని ఆదుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హరీష్ రావు కోరారు.

# తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియమ్మ

విశాల భారతి, స్టేట్‌బ్యూరో:

హైదరాబాద్ లోని గాంధీభవన్‌లో సోనియాగాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి గాంధీభవన్‌కు వచ్చిన రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క.. ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సోనియా 78 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 78 కిలోల కేక్‌ను కాంగ్రెస్ నేతలు కట్ చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్ రావ్ థాక్రే కేక్ కట్ చేసి రేవంత్ రెడ్డి సహా ఇతర నేతలకు తినిపించారు. ఈ కార్యక్రమంలో పలు ఆసక్తికర సన్నివేశాలు కనిపించాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సీనియర్ నేత వీహెచ్ ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. సోనియా గాంధీ 78వ బర్త్‌డే సందర్భంగా శుభాకాంక్షలు చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. సోనియా గాంధీ కేక్ కట్ చేసే హక్కు, అర్హత వీహెచ్ కే ఉందంటూ ఆయనతో కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. సోనియా బర్త్‌డే రోజునే తెలంగాణ ప్రకటన వచ్చిందని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని రేవంత్ పేర్కొన్నారు. తెలంగాణ ఇచ్చిన నిజమైన తెలంగాణ తల్లి సోనియా గాంధీ అన్నారు. కార్యకర్తల త్యాగం, కష్టంతోనే తెలంగాణలో అధికారంలోకి వచ్చామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 2009 డిసెంబర్ 9న అప్పటి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రక్రియ మొదలు పెట్టింది.. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి ఎన్ని రాజకీయ ఒడిదొడుకులు ఎదుర్కొన్నా రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు.. డిసెంబర్ 7న ఎల్బీ స్టేడియంలో సోనియా గాంధీ వచ్చినప్పుడు తెలంగాణ తల్లిని చూశారు.. లక్షలాది మంది తెలంగాణ బిడ్డలకు నేనున్న అంటూ భరోసా ఇచ్చారు. ఎల్బీ స్టేడియంలోకి సోనియా గాంధీ ప్రవేశించినప్పుడు ప్రజలు నిల్చొని అభినందించినప్పుడు ఆమె ముఖంలో సంతోషం కలిగిందన్నారు. మళ్లీ అలాంటి రోజు చూడలేం.. పీసీసీ అధ్యక్షుడి గా తనకు చాలా సంతోషం కలిగిందన్నారు. 2017 డిసెంబర్ 9న మొదటిసారి గాంధీభవన్ లో కాలు పెట్టాను.. ఇప్పుడు డిసెంబర్ 9 ముఖ్యమంత్రి గా వచ్చానన్నారు. 10 సంవత్సరాల్లో కార్యకర్తలు వేల కేసులు మోస్తున్నారు.. కార్యకర్తలకు మాట ఇస్తున్న ఈ ప్రభుత్వం మీది.. పేదలది.. ఇందిరమ్మ ఆశయాలను నెరవేరుస్తామంటూ హామీనిచ్చారు. మొదటిసారి ఈరోజు అసెంబ్లీలో అడుగు పెడుతున్నాం.. అందరూ ఆశీర్వదించాలంటూ రేవంత్ రెడ్డి కోరారు.తెలంగాణలో ప్రజాప్రభుత్వం ఏర్పాటైందని.. తాము ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి చారిత్రాత్మకమైన రోజు..సోనియా గాంధీ జన్మదినం, తెలంగాణ ప్రకటన చేసిన రోజు.. తెలంగాణ వచ్చిన తరువాత కూడా దశాబ్ద కాలం ఎదురు చూడాల్సి వచ్చిందన్నారు. మార్పు కోసం రాష్ట్ర ప్రజలు అద్భుత తీర్పు ఇచ్చారని.. రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ సిద్ధాంతాలను వివరిస్తున్నాం.. ప్రతి హామీ అమలు చేస్తామని, రాష్ట్ర సంపద ,వనరులను ప్రజలకు పంచడానికే ప్రజా ప్రభుత్వ ఏర్పడిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ఎల్పీ నేతగా కేసీఆర్

- ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఎమ్మెల్యేలు
- కేసీఆర్ పేరును ప్రతిపాదించిన పోచారం

హైదరాబాద్,విశాలభారతి:

తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ శాసనసభపక్ష నేతగా ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీఆర్ఎస్పీ నేత కేశవరావు అధ్యక్షతన తెలంగాణ భవన్లో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు సమావేశం అయ్యారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి కేసీఆర్ పేరును ప్రతిపాదించారు. మాజీ మంత్రులు శ్రీనివాస్ యాదవ్, కడియం శ్రీహరి కేసీఆర్‌ను బలపరిచారు. శాసనసభాపక్షం మిగతా కమిటీని ఎంపిక చేసే బాధ్యతను కేసీఆర్‌కు అప్పగిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అనంతరం ప్రత్యేక బస్సుల్లో బయలుదేరి అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొన్నారు. కేసీఆర్ ఎన్నిక అంశాన్ని అసెంబ్లీ స్పీకర్, కార్యదర్శికి లేఖ అందజేశారు.

తెలంగాణలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్... ప్రతిపక్ష స్థానంలోకి వచ్చింది. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 39 స్థానాలను గెలుచుకుని రెండోస్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ తర్వాత మెజార్టీ స్థానాలను గెలిచిన బీఆర్ఎస్ కు ప్రతిపక్ష హోదా దక్కనుంది. బీఆర్ఎస్ ఎల్పీ నేతగా కేసీఆర్ ఎన్నికైన నేపథ్యంలో... ఆయనే ప్రతిపక్ష నేతగా వ్యవహరించనున్నారు. ప్రస్తుతం యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కేసీఆర్. ఎముక మార్పిడి సర్జరీ అయిన నేపథ్యంలో... ఆరు నుంచి 8 వారాల పాటు ఆయన విశ్రాంతి తీసుకోనున్నారు.

# నిలకడగా కేసీఆర్ ఆరోగ్యం

మొదటిపేజీ తరువాయి

సోమాజిగూడలోని యశోద ఆస్పత్రికి తరలించారు. సీటీ స్కాన్ చేసిన వైద్యులు.. ఆయనకు ఆపరేషన్ అవసరమని గుర్తించి.. హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీ చేశారు. సుమారు 2 గంటలకు పైనే ఆపరేషన్ జరిగగా విజయవంతంగా ముగిసింది. ప్రస్తుతం కేసీఆర్ ఆరోగ్యం నిలకడగా ఉంది. వైద్యుల పర్యవేక్షణలో కేసీఆర్ కు చికిత్స కొనసాగుతోంది. తాజాగా.. వైద్యులు కేసీఆర్ ను వాకర్ సహాయంతో నడిపిస్తున్న ఫొటోలను ఆసుపత్రి యాజమాన్యం విడుదల చేసింది. 6 నుంచి 8 వారాల్లో కేసీఆర్ పూర్తిగా కోలుకుంటారని డాక్టర్లు చెబుతున్నారు.మరోవైపు కేసీఆర్ త్వరగా కోలుకోవాలని రాజకీయాలకు అతీతంగా నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ శ్రేణులు తెలంగాణ వ్యాప్తంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు ఆస్పత్రి లోనే ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలుసుకుంటున్నారు. కేసీఆర్ కూతురు ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రి కేటీఆర్, కేసీఆర్ సతీమణి శోభ సహా కుటుంబసభ్యులంతా ఆస్పత్రిలోనే ఉన్నారు.

# తుమ్మినా దగ్గినా కాంగ్రెస్‌ప్రభుత్వం పడిపోతుంది..

- లోపాయికారి ఒప్పందంతోనే మజ్లిస్ ప్రొటెం స్పీకర్
- ప్రభుత్వానికి ఎంఐఎం ఐదో టైరు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి

విశాల భారతి, స్టేట్‌బ్యూరో:



కాంగ్రెస్, మజ్లిస్ పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. అందులో భాగంగానే ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ ఒవైసీని చేశారన్నారు. సీనియర్ ఎమ్మెల్యేలను కాదని ఏ ప్రాతిపదికన ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్‌ను చేశారని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ''ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ప్రజలు బీజేపీ ని ఆదరించారు. ఒక్క స్థానం నుంచి 8 సీట్లకు పెరిగాం. 6 నుంచి 14 శాతానికి మా ఓటు బ్యాంకు పెరిగింది. కాంగ్రెస్ పార్టీ తన పాత అలవాటు ప్రకారం శాసనసభ గౌరవాన్ని కాల రాసింది. మజ్లిస్‌తో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఆ పార్టీ వ్యక్తిని ప్రొటెం స్పీకర్‌ను చేసింది. అక్బరుద్దీన్ ఓవైసీని ప్రొటెం స్పీకర్ చేయడాన్ని బీజేపీ వ్యతిరేకిస్తోంది. అనేక మంది సీనియర్ ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ అక్బరుద్దీన్‌ను ప్రొటెం స్పీకర్‌ను చేశారు. ప్రొటెం స్పీకర్ సమక్షంలో బీజేపీ ఎమ్మెల్యేలు ఇవాళ ప్రమాణ స్వీకారం చేయరు. ఈ అంశంపై గవర్నర్‌కు కూడా ఫిర్యాదు చేస్తాం. స్పీకర్ ఎన్నికను ఆపాలని డిమాండ్ చేస్తున్నాం. రెగ్యులర్ స్పీకర్ ఎన్నిక తరువాతే బీజేపీ ఎమ్మెల్యేలు ప్రమాణం చేస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మినా.. దగ్గినా పడిపోతుంది అందుకే మజ్లిస్‌ను మచ్చిక చేసుకునే ప్రయత్నం చేస్తోంది'' అని కిషన్ రెడ్డి విమర్శించారు. తొలుత బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎనిమిది మంది ఎమ్మెల్యేలు కిషన్ రెడ్డితో భేటీ అయ్యారు. అనంతరం చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. అక్కడి నుంచి అంబేద్కర్ విగ్రహం, గన్ పార్క్ వద్ద నివాళులర్పించారు.

**అక్బరుద్దీన్‌కంటే ఐదుగురు సీనియర్లు**

ఎన్నికల సమయంలో మజ్లిస్, బీజేపీ ఒకటేనని కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరోపించారని, ఇప్పుడు కాంగ్రెస్ అసలు రంగు బయటపడిందన్నారు. బొటాబొటీ మెజారిటీతోనే రేవంత్ సర్కార్ నడుస్తోందని కిషన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకే ఎంఐఎంతో కాంగ్రెస్ దోస్తీ చేస్తుందని ఆరోపించారు. సభలో అక్బరుద్దీన్ కంటే ఐదుగురు సీనియర్ సభ్యులు ఉన్నారని బీజేపీ ఎమ్మెల్యేలు తెలిపారు. అయినా మజ్లిస్ ఎమ్మెల్యేను ప్రొటెం స్పీకర్‌గా ఎంపిక చేయడం కాంగ్రెస్, ఎంఐఎం స్నేహానికి నిదర్శనమని బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎంఐఎం ఐదో టైర్ లాంటిదని కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి విమర్శించారు.

## పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రమాణ స్వీకారం

- ప్రజాసేవకు అంకితమవుతానని వెల్లడి



విశాల భారతి, స్టేట్‌బ్యూరో: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఓవైసీ ప్రమాణం చేయించారు. ముందుగా సీఎం రేవంత్‌రెడ్డి, తర్వాత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఆ తర్వాత వరుసగా మంత్రులు ప్రమాణం చేశారు. ఆ తర్వాత ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు. తొలి ఎన్నికలోనే 66 ఏళ్ల రాజకీయ నేత 'ఎర్రబెల్లి' ని మట్టికరిపించిన 26 ఏళ్ల యశస్వినిరెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా అసెంబ్లీ హాల్‌నినాదాలతో హోరెత్తింది. అనంతరం యశస్వినిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అనునిత్యం కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో ప్రజాదర్బార్‌నిర్వహిస్తామని తెలిపారు. ఆమె వెంట కాంగ్రెస్‌పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, పీసీసీ మెంబర్‌హనుమాండ్ల ఝాన్సీరెడ్డి తదితరులు ఉన్నారు.

# మంత్రులకు శాఖల కేటాయింపు

- ఆర్థిక శాఖ భట్టి విక్రమార్కకు
- ఐటీ మంత్రిగా శ్రీధర్ బాబు

విశాల భారతి, స్టేట్‌బ్యూరో:

తెలంగాణ రాష్ట్ర మంత్రులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రిత్వ శాఖలను కేటాయించారు. శుక్రవారం దిల్లీ వెళ్లిన సీఎం.. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సుదీర్ఘ చర్చలు జరిపారు. అనంతరం మంత్రుల శాఖలపై శనివారం ప్రకటన చేశారు. హోం, పురపాలక, విద్య, ఎస్సీ, ఎస్టీ సంక్షేమంతో పాటు మంత్రులకు కేటాయించని ఇతర శాఖలను సీఎం తన వద్దే పెట్టుకున్నారు.

**మంత్రుల శాఖల వివరాలివే..**

1. భట్టి విక్రమార్క -, ఆర్థిక, ఇంధన శాఖ
2. తుమ్మల నాగేశ్వరరావు , - వ్యవసాయం, చేనేత
3. జూపల్లి కృష్ణారావు, - ఎక్సైజ్, పర్యాటకం
4. ఉత్తమ్ కుమార్ రెడ్డి, - నీటి పారుదల, పౌరసరఫరాలు
5. దామోదర రాజనర్సింహ, - వైద్య, ఆరోగ్య శాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ
6. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి -, ఆర్ అండ్ బీ, సినిమాటోగ్రఫీ
7. దుద్దిళ్ల శ్రీధర్‌బాబు -, ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాలు
8. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి - , రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ
9. పొన్నం ప్రభాకర్ , రవాణా, బీసీ సంక్షేమం
10. సీతక్క, - పంచాయతీ రాజ్, మహిళ, శిశు సంక్షేమం
11. కొండా సురేఖ -, అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ



# 'పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ క్లీన్ స్వీప్ ఖాయం'

- ఎవరు ఎన్ని విమర్శలు రాష్ట్రంలో 8 సీట్లు గెలిచాం
- బీజేపీపై తెలంగాణ ప్రజలకు నమ్మకం పెరిగింది
- బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్

విశాల భారతి, స్టేట్‌బ్యూరో:

తెలంగాణలో మరికొన్ని నెలల్లో వచ్చే లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ క్లీన్ స్వీప్ చేయటం ఖామమని మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా, తప్పుడు ప్రచారాలు చేసినా బీజేపీని తెలంగాణ ప్రజలు 8 స్థానాల్లో గెలిచారని తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీకీ ఓట్లు, సీట్లు పెంచేందుకు కృషి చేసిన ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్తకు ఈటల ధన్యవాదాలు చెప్పారు. బీజేపీపై ప్రజల్లో నమ్మకం పెరిగిందన్నారు. అందుకు నిదర్శనమే ఈసారి సీట్లతో పాటు ఓటింగ్ శాతం కూడా పెరగడం అని పేర్కొన్నారు. అయితే.. గతంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో నాలుగు స్థానాల్లోనే గెలిచిన బీజేపీ.. ఈసారి వచ్చే ఎన్నికల్లో బీజేపీ క్లీన్ స్వీప్ చేస్తుందని రాజేందర్ ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే అని నిరూపించామని ఈ సందర్భంగా అన్నారు.

పీఎం నరేంద్ర మోదీ.. గత తొమ్మిదేళ్ల పాటు భద్రత, భరోసానే కాదు ప్రపంచవ్యాప్తంగా భారత దేశ గొప్పతనాన్ని చాటారని ఈటల రాజేందర్ కొనియాడారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్‌లలో బీజేపీ సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఈటల గుర్తు చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 400 స్థానాలు గెలవడమే లక్ష్యంగా మోదీ పని చేస్తున్నారని వివరించారు. అయోధ్యలో అందరినీ ఒప్పించి రామాలయం కట్టిస్తున్న వ్యక్తి మోదీ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మోదీకే ఓటేస్తామని ప్రజలు చెబుతున్నారన్నారు. కాగా.. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పూర్తిగా కేంద్ర ప్రభుత్వం నిధులతో చేస్తున్నవే అని ఈటల చెప్పుకొచ్చారు. పేదలకు సొంతింటి కళ నెరవేర్చే బాధ్యత కేంద్ర ప్రభుత్వం తీసుకుంటుందని ఈటల రాజేందర్ వెల్లడించారు.

**మజ్లిస్‌తో అంటకాగే ఏ పార్టీతో బీజేపీ కలిసి ముందుకు వెళ్లదు**

**బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రఘునందన్ రావు**

తెలంగాణలో కొత్తగా రాష్ట్రం ప్రభుత్వం ఏర్పాటై రెండు రోజులు కాకముందే, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేసిన వ్యాఖ్యలను భారతీయ జనతా పార్టీ ఖండిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రఘునందన్ రావు తెలిపారు. ఆయన మాట్లాడిన మాటలు ప్రజాస్వామ్య ప్రక్రియకే పూర్తి విఘాతం కలిగించేలా కనిపిస్తున్నాయని రఘునందన్ రావు అన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బొటాబొటిన స్థానాలు గెలుచుకుందని, ఏడాదిలో బీఆర్ఎస్ ప్రభుత్వం బీజేపీ, ఎంఐఎం పార్టీలను కలుపుకొని ఏర్పాటవుతుందనటం పట్ల భారతీయ జనతా పార్టీకు ఎలాంటి సంబంధ లేదన్నారు. మజ్లిస్‌తో అంటకాగే ఏ పార్టీతో బీజేపీ కలిసి ముందుకు వెళ్లదని స్పష్టం చేశారు. చివరకు ఇవాళ అసెంబ్లీలో ప్రొటెం స్పీకర్‌గా ఎంఐఎం పార్టీ సభ్యుడు అక్బరుద్దీన్ ఓవైసీని నియమించడం పట్ల బీజేపీ శాసన సభ్యులు ప్రమాణ స్వీకారం కూడా చేయలేదన్న విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీకి వార్నింగ్ ఇచ్చినట్లు మాట్లాడుతున్న కడియం శ్రీహరి మాటలను తప్పుపట్టారు. ఒక సీనియర్ సభ్యుడిగా ఆ వ్యాఖ్యలు సరికాదన్నారు.

# గత ప్రభుత్వ సలహాదారులకు ఉద్వాసన

- సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ శాంతికుమారి

హైదరాబాద్,విశాలభారతి:



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పలు మార్పులకు శ్రీకారం చుట్టారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రభుత్వ సలహాదారులుగా ఉన్న ఏడుగురిని రేవంత్ ప్రభుత్వం తొలగించింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. వీరితో పాటు స్పెషల్ ఆఫీసర్లను కూడా రేవంత్ ప్రభుత్వం తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

సీఎం ముఖ్య సలహాదారు సోమేశ్ కుమార్, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, సాంస్కృతిక, దేవాదాయ సలహాదారు కేవీ రమణాచారి(రీసెంట్ రిజైన్), ప్రభుత్వ ప్రధాన సలహాదారు చెన్నమనేని రమేష్, హోంశాఖ సలహాదారు అనురాగ్ శర్మ, ముస్లిం మైనారిటీ సంక్షేమ సలహాదారు ఏకే ఖాన్, అటవీ సంరక్షణ శాఖ ముఖ్య సలహాదారు శోభలను తొలగించారు. వీరితోపాటు స్పెషల్ ఆఫీసర్ హోదాలో ఉన్న ఇరిగేషన్ అడ్వైజర్ ఎస్కే జోషి, ఫైనాన్స్ డిపార్టుమెంట్ స్పెషల్ ఆఫీసర్లు జీఆర్‌రెడ్డి, శివశంకర్, ఆర్ అండ్ బీ శాఖ స్పెషల్ ఆఫీసర్లు సుధాకర్ తేజ, ఇంధన సెక్టార్ స్పెషల్ ఆఫీసర్లు రాజేంద్ర ప్రసాద్ సింగ్, ఉద్యాన శాఖ అడ్వైజర్ శ్రీనివాస్‌రావులను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గత ప్రభుత్వ సలహాదారులతో పాటు స్పెషల్ ఆఫీసర్ హోదాలో ఉన్న అధికారుల నియామకాలను రద్దు చేస్తూ సీఎస్ తాజాగా ఉత్తర్వులు జారీచేయడంతో వీరంతా ఇప్పుడు ఇంటిదారి పట్టనున్నారు. వీరి స్థానంలో ప్రొఫెసర్ కోదండరామ్, మరి కొంత మంది అధికారులను ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా నియమించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.



# ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

- ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ
- పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,శనివారం ఘనంగా నిర్వహించారు.సందర్భంగా కొండాపూర్ లోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్ గౌడ్ విచ్చేసి రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన తల్లిగా ప్రజలు ఆదరించి నేడు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని ఆదరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.అధికారంలో వచ్చిన వెంటనే పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ హామీలలో రెండు పథకాలను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహాలక్ష్మి ,చేయూత పథకాలల్లో మహిళలకు ఉచిత బస్ సౌకర్యం,రాజీవ్ ఆరోగ్య శ్రీ ని నేటి నుండి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఆరోగ్యశ్రీ వైద్య సహాయం 10, లక్షల రూపాయలు పథకాన్ని ప్రారంభించుకోవడంతో ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి, సంగారెడ్డి,జంగం గౌడ్,లంబు రెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.




# విద్యా బోధనలో వినూత్న విధానం

**విశాలభారతి,కంటోన్మెంట్:** విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు, వారి ప్రతిభకు పదునుపెట్టెందుకు నూతన విద్యా బోధన విధానాన్ని అమలు చేస్తున్నట్లు మాస్టర్ మైండ్స్ పాఠశాల ప్రిన్సిపల్ సునీత తెలిపారు.ఓల్డ్ బోయిన్పల్లి లోని మాస్టర్ మైండ్స్ పాఠశాలలో చిన్నారులకు వారి తల్లితండ్రుల సమక్షంలో విద్యా బోధనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు..చిన్నారులు సులువుగా విద్యను అభ్యసించేందుకు వీలుగా లర్నింగ్ విత్ ఫన్ పేరుతో ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులకు సులువుగా అర్థమయ్యే రీతిలో బోధించడం మూలంగా చిన్ననాటి నుండి విద్య పట్ల మక్కువ పెరిగే అవకాశం ఉందన్నారు.. చిన్నారులకు వినూత్న రీతిలో విద్యను బోధించడం మూలంగా ఆలోచన శక్తి, జ్ఞాపకశక్తి మెరుగవుతుందని వెల్లడించారు.



### అత్యాశ పడొద్దు...

చేతిలో నగదు నిల్వ ఉందనే భావనలో గతంలో మాదిరి ప్రీ లాంచ్, ప్రమోషనల్ లాంచ్ మాయలో చాలా మంది పెట్టుబడులు పెట్టారు. ఆ సమయంలో బిల్డర్ విశ్వసనీయతను బట్టి కొంత మంది లాభాలు గడించారు. మరికొంత మంది కొనుగోలుదారులకు ఎగనామం పెట్టిన సంఘటనలు ఈ పదేళ్లలో చోటుచేసుకున్నాయి. అలాంటి అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అధిక రాబడి కోసం అత్యాశ పడకపోవడమే ఉత్తమంలా కనిపిస్తోంది. ముఖ్యంగా రేరా, రియల్ ఎస్టేట్ రంగంపై ప్రభుత్వ విధివిధానాలను పరిగణనలోకి తీసుకుని, ఏమాత్రం ప్రలోభాలకు గురికాకుండా ఉండటమే మంచిది. అదేవిధంగా గత ప్రభుత్వం కూడా ప్రీ లాంచ్ అమ్మకాలు జరిగినా.. చూసీచూడనట్లుగానే వ్యవహారించింది. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం ఆయా బిల్డర్ల అవకతవకలను బయటకు తీసే ప్రయత్నం గనుక చేస్తే ఆ ప్రాజెక్టులో కొనుగోలు చేసిన వారు కొంత ఇబ్బంది పడే అవకాశం ఉంటుంది. కాబట్టి పెట్టిన పెట్టుబడిపై రెండింతలు, మూడింతల రాబడి అంటూ లెక్కలు వేసుకుంటూ గుడ్డిగా ఇన్నాళ్లు దాచుకున్న సొమ్మును మార్కెట్‌లోకి తీసుకు రాకపోవడమే మంచిది.

“ ఎన్నికల హడావుడి ముగిసింది. ప్రభుత్వం మారింది. ఇక అందరి దృష్టి హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌పైనే పడింది. ఇన్నాళ్లు కంపెనీలు, పెట్టుబడుల పేరిట బీఆర్ఎస్ రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రోత్సహించగా, అదే సమయంలో భూములకు వేలం నిర్వహించి పలు ప్రాంతాల్లో మార్కెట్ ధరలను ప్రభావితం చేసింది. ఈ క్రమంలో ప్రభుత్వం కూడా మార్కెట్‌కు అనుగుణంగా ఉండేలా పాలసీలు, విధానాల అమలు ప్రాధాన్యత ఇవ్వడంతో ఇన్నాళ్లు మార్కెట్ పరుగులు పెట్టింది. అయితే అడపాదడపా మార్కెట్‌పై అంతర్గతమైన అంశాలు కొంత ప్రభావం చూపి, మార్కెట్ స్థిరంగా కొనసాగేలా సాయపడ్డాయి. ఈ క్రమంలో తెలంగాణలో కొత్తగా కొలువు దీరినా కాంగ్రెస్ ప్రభుత్వం, రియల్ ఎస్టేట్ నేపథ్యం ఉన్న రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఇప్పుడు తెలంగాణలో మార్కెట్ ఏ విధంగా ఉంటుందనే చర్చ నడుస్తోంది. అదే సందర్భంలో కర్ణాటకలో ఏర్పడిన కాంగ్రెస్ పాలనలో రియల్ ఎస్టేట్ మార్కెట్ ఆమాంతం పడిపోవడం కూడా హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోతుందనే వాదనలు తెరమీదకు వచ్చేలా చేసింది. ఈ క్రమంలో రాష్ట్రానికి ఆదాయం తీసుకువచ్చే రియల్ ఎస్టేట్ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ఏ విధంగా వ్యవహారిస్తారు? గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి ఏ విధంగా మార్పులకు లోనవుతుంది. బలహీనంగా ఉన్న రేరాను ఏవిధంగా పటిష్టం చేస్తారు? భవన నిర్మాణ రంగానికి ఊతమిచ్చేలా ఎలాంటి ప్రోత్సాహకాలు ఉంటాయనే అంశాలపైనే హైదరాబాద్ రియల్ మార్కెట్ ఆధారపడి ఉండగా..అయితే ప్రభుత్వం పూర్తి స్థాయిలో కూర్పు జరిగేంత వరకు అధిక రాబడి కోసం అత్యాశతో రియల్ పెట్టుబడులు చేయవద్దనేది రియల్ నిపుణులు సూచిస్తున్నారు.

# మార్కెట్‌కు ఢోకా లేదు...

# కానీ అత్యాశ పడొద్దు

- కొత్త ప్రభుత్వం పనితీరుపై ఆధారపడిన రియల్ ఎస్టేట్
- అప్పటివరకు సర్దుబాటు దశలోనే రియల్ రంగం.
- ధరలు పడిపోకున్నా స్థిరంగా కొనసాగే అవకాశం
- అయితే అధిక రాబడి మాయలో పడొద్దని నిపుణుల సూచనలు





### భరోసా ఇస్తేనే... రియల్ పరుగులు...

అధికారం చేపట్టిన రేవంత్ రెడ్డికి రియల్ ఎస్టేట్ వ్యాపారిగా గుర్తింపు ఉంది. ఆయనే పలు సార్లు తనకు రియల్ ఎస్టేట్ రంగంలో అపారమైన అనుభవం ఉందని చెప్పకున్నారు. కొత్తగా ఏర్పాటైన మంత్రి వర్గ విస్తరణలోనూ రియల్ ఎస్టేట్ రంగానికి సహకరించే మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖను తన వద్దే ఉంచుకోగా, రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రభావితం చేసే పరిశ్రమలు, ఐటీ, రూరల్ డెవలప్ మెంట్‌కు అవసరమైన పంచాయతీ రాజ్ శాఖలను వేర్వేరు వ్యక్తులు ప్రాతినిధ్యం వహిస్తుండటం కొంత రియల్ ఎస్టేట్ రంగానికి ప్రతికూలంగా మారే అవకాశం ఉంటుంది. గతంలో మాదిరి పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా వేగంగా నిర్ణయాలను అమలు చేయించుకునే పరిస్థితులు కనిపించడం లేదు. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వమే చొరవ తీసుకుంటే గనుక మళ్లీ రియల్ ఎస్టేట్ రంగానికి పూర్వ వైభవం, రియల్ వ్యాపారుల్లో ఆందోళనలు తొలగిపోయే అవకాశం ఉంటుంది.

**విశాలభారతి, హైదరాబాద్ :**

రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రాధాన్యాలు, పాలసీలపైనే హైదరాబాద్ మార్కెట్ ఆధారపడి ఉంది. ఇప్పుడి ప్పుడే క్యాబినెట్ కూర్పు, శాఖల పనితీరుపై దృష్టి సారించిన కొత్త ప్రభుత్వం అందుకు తగినట్లుగా వనరులను అవగాహన తెచ్చుకుంటున్నది. నాలుగు నెలల వ్యవధిలో లోక్‌సభ ఎన్నికల హడావుడి దేశ వ్యాప్తంగా మొదలుకాకున్న నేపథ్యంలో... వచ్చే ఏడాది వరకు రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో స్తబ్ధుగానే ఉంటుందనే చర్చ నడుస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయాన్ని సమకూర్చే రియల్ ఎస్టేట్ రంగంపై ఏ ప్రభుత్వం కూడా నిర్లక్ష్యం చేయదు కానీ కొన్ని ప్రత్యేక సందర్భాలు మార్కెట్ జోరును ఎప్పుడూ నియంత్రిస్తూనే ఉంటాయి. అలాంటి పరిస్థితులు ప్రస్తుతం హైదరాబాద్ వేదికగా ఏర్పడిన క్రమంలో మార్కెట్ కొంత సర్దుబాట్లకు గురయ్యే అవకాశం ఉంటుంది. అయితే ఆ సర్దుబాట్ల తీవ్రతను బట్టి మార్కెట్‌లో రియల్ మార్కెట్ ర్యాలీ కొనసాగుతుండగా, లేక స్తబ్ధుగా నిలబడుతుందా? లేదంటే ఆమాంతం ఒక్కసారి కుప్పకూలిపోతుందా? అనేది తేలిపోనుంది. మార్కెట్‌లో క్రయవిక్రయాలు నెమ్మదించినా.. దేశంలోని మిగత నగరాలతో పోల్చితే హైదరాబాద్‌లో రియల్ జోరు కొనసాగుతూనే ఉంది. ఇతర నగరాల కంటే వేగంగా ఇండ్ల ధరలు పెరిగాయి. హైదరాబాద్ అభివృద్ధి, ఐటీ, ఐటీయేతర రంగాల్లో పెట్టుబడుల కారణంగా రియల్ మార్కెట్‌ను సానుకూలంగా పరుగులు పెట్టించాయి. ఈ పదేళ్ల కాలంలో ఫ్లాట్లు, ఇండ్ల ధరలు కూడా భారీగానే పెరిగాయి. కానీ ప్రభుత్వం మారిపోవడంతో రియల్ ఎస్టేట్ రంగం ఇకపై ఎలా ఉంటుందనే అంశాలను నిపుణులు ఆసక్తి చూస్తున్నారు.

**ప్రభుత్వ ప్రాధాన్యతలతోనే...**

రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రభావితం చేయడంపై కాంగ్రెస్ దృష్టి పెట్టి, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవడంతోనే రియల్ భూమ్ మొదలైతుంది. ఇదంతా జరగాలంటే కనీసం ఆరు నెలలు గడిస్తే గానీ సాధ్యం కానీ పరిస్థితి. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న ప్రాధాన్యతలు, మార్కెట్‌ను ప్రభావితం చేసే మౌలిక వసతుల కల్పన, నిర్మాణానికి రంగానికి అవసరమైన ఉద్దీపనల వంటి అంశాలపై ఇప్పటినుంచే దృష్టి పెడితే ఆరు నెలల్లోనే మార్కెట్ యథావిధిగా కోలుకునే అవకాశం ఉంటుంది. లేదంటే లోక్‌సభ ఎన్నికల పూర్తయ్యేంత వరకు మార్కెట్‌లో జరిగిన లోటుపాట్లు సర్దుబాటు జరుగుతూనే ఉంటాయనేది నిపుణుల వాదన. కొన్ని ప్రాంతాల్లో ఆమాంతం పెరిగిన భూముల ధరల నిజ స్వభావం తేలిపోనుండగా, మరికొన్ని ప్రాంతాల్లో కొత్త ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి ప్రణాళికలు కొత్తగా భూముల ధరలు పెరిగేలా చేస్తుంటాయి. అదేవిధంగా ఇండ్ల ధరలు కూడా వచ్చే ఏడాది వరకు స్థిరంగానే ఉండే అవకాశం ఉంటుంది. ఈ ఏడాదిలో ప్రభుత్వ పనితీరు, పాలకుల సమర్థతను బట్టి ఇండ్ల ధరలు ప్రభావితమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా గత ఏడాదిలో ఎకరం రూ. 100 కోట్లు పలికిన కోకాపేట్ భూముల ధరలు కొత్త ఏడాది వరకు ఎలాంటి మార్పులు లోనయ్యే అవకాశం కనిపించడం లేదు.

**చిన్న, మధ్య స్థాయి బిల్డర్లకు కష్టమేనా?**

ప్రస్తుతం కొనసాగుతున్న సందిగ్ధ పరిస్థితుల ప్రభావం కొనుగోలుదారులకు అనుకూలమే అయినప్పటికీ... చిన్నా, మధ్య స్థాయి బిల్డర్లకు కొన్ని కష్టాలు తీసుకువచ్చే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా బ్యాంకింగ్ ఫండింగ్ ఆధారంగా నిర్మాణం చేపట్టే బిల్డర్లకు కొంత కష్టకాలంగానే కనిపిస్తోంది. ఇన్నాళ్లు లాభాలు కురిపించినా... ఇకపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపైనే మార్కెట్‌లో క్రయవిక్రయాలు ప్రభావితం అవుతాయి గనుక ర్యాలీ మొదలయ్యే వరకు వ్యాపారులు నెట్టుకురావాల్సిందేనని చెబుతున్నారు. ఈ కారణంగా ఆర్థికంగా బలమైన బిల్డర్ల కంటే బలహీనంగా ఉంటే చోటా, మోటా బిల్డర్ల లాభాల జోరు తగ్గే అవకాశం ఉంటుంది.

ఇక ఓపెన్ ప్లాట్ల ధరలు కూడా మరో ఆరు నెలలపాటు పెరగకపోవచ్చని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



### జీవో నెం. 111 తొలగని సందిగ్ధం..

కేసీఆర్ ప్రభుత్వం 111 జీవోను ఎత్తివేస్తామని ప్రకటించి సరిగ్గా ఎన్నికల ముందే జీవో పేరిట హడావుడి చేసింది. దీంతో ఆ పార్టీ ఓడిపోవడం, మరో ప్రభుత్వం అధికారం దక్కడం వంటి వలన ఈ భూముల వ్యవహారం మరింత ఆసక్తిగా మారింది. ప్రస్తుతం ఉన్న సందిగ్ధం నేపథ్యంలో... ఈ ప్రాంతంలో భూముల క్రయవిక్రయాలపై తొందరపడకపోవడమే మంచిదనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ కూడా జీవో నెం. 111 విషయంలో ఒక్కసారి కూడా స్పందించలేదు. బీఆర్ఎస్ తీసుకున్న నిర్ణయాన్ని కూడా సమర్థించలేదు. కావున కొత్త ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వచ్చేంత వరకు ఆ భూములను ముట్టుకోకపోవడమే మంచిది.

**శివారులకు మహార్దశ**

ప్రస్తుతం విపరీతంగా పెరిగిన కోర్ సిటీ కంటే అవుటర్ రింగ్ రోడ్డు దాటి, కొత్తగా నిర్మిస్తున్న ట్రిపులార్ ప్రాజెక్టు మధ్య ఉండే ప్రాంతాలతో రియల్ ఎస్టేట్ రంగానికి మహార్దశ పట్టే అవకాశం ఉంది. రూ. 50వేల గజం ఉన్న ప్రాంతాల్లో ఇక ధరలు పెరిగే అవకాశం లేదు కానీ, భవిష్యత్‌లో మార్కెట్ అంచనాను బట్టి గజానికి రూ. 10 నుంచి 20వేల లోపు ధరలో కొనుగోలు చేయడం వలన మంచి రాబడిని పొందే వీలు ఉంటుంది. ఇలా కొనుగోలు చేయడం వలన భవిష్యత్తులో సొంతింటిని అయినా నిర్మించుకోవచ్చు, లేదంటే రీసేలింగ్ ద్వారా ఆదాయాన్ని అయినా సమకూర్చుకునే వీలు ఉండటంతో శివారు ప్రాంతాల్లో భూములకు రానున్న రోజుల్లో మహార్దశ పట్టే అవకాశం ఉంటుంది.

## నడిరోడ్డుపై బైక్ లో మంటలు

**మంచిర్యాల, విశాల భారతి:**మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద శనివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో బైక్ పెట్రోల్ ట్యాంకు పగిలిపోవడంతో ఒకసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తికి మంటలు అంటుకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని వివరాలు తెలియాల్సింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇలా జరగడాన్ని చూసి భయభ్రాంతులకు గురవుతున్నామని అక్కడి ప్రజలు అంటున్నారు.



# ఫ్రీ బస్ ప్రయాణం ప్రారంభం...!



**మిర్యాలగూడ, విశాలభారతి:** కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన రెండు రోజుల్లోనే రెండు గ్యారెంటీలకు శ్రీకారం చుట్టింది. శనివారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ ఆర్టీసీ డిపోలో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యాన్ని మిర్యాలగూడ ఏడిఏ పోరెడ్డి నాగమణి, డిఎస్పీ వెంకటగిరి, ఆర్టీసీ డిపో మేనేజర్ పాల్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహిళలు, విద్యార్థినిలు, ట్రాన్స్ జెండర్లకు లకు బస్సు ప్రయాణం ఉచితంగా రాష్ట్ర పరిధిలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణం చేసే అవకాశం కల్పించారన్నారు. పల్లె వెలుగు ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరీ, సిటీ మెట్రో ఎక్స్ ప్రెస్, సర్వీసులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం జరిగింది. మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మిర్యాలగూడ ఆర్టీసీ డిపో నుంచి తొలి పల్లె వెలుగు బస్సు నల్గొండకు ప్రయాణమైంది. తొలి బస్సులో ప్రయాణించే మహిళలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అనిత, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, టూ టౌన్ సిఐ నరసింహారావు ఉన్నారు.



## మహాలక్ష్మి పథకం మహిళలకు వరం

**మున్సిపల్ కమిషనర్ సరస్వతి**

**తొర్రూరు, విశాల భారతి:**రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం హర్షనీయమని మున్సిపల్ కమిషనర్ సరస్వతి అన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో డీఎం పరిమళ తో కలిసి మున్సిపల్ కమిషనర్ సరస్వతీ ప్రారంభించారు. అనంతరం బస్సులో ప్రయాణించి ఉచిత టికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసే అవకాశాన్ని కల్పించిందని, ఈ సౌకర్యం మహిళా లోకానికి గొప్ప వరమని తెలిపారు.ఈ ప్రాంతం లోని బాలికలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు వయస్సుతో నిమిత్తం లేకుండా రాష్ట్రంలో ఎక్కడైనా టీఎస్ ఆర్టీసీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగానే ప్రయాణించవచ్చన్నారు. ఆర్టీసీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు మహిళలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు చూపించాల్సి ఉంటుందన్నారు.



## ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

**నూతనకల్, విశాల భారతి:**నూతనకల్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాగం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కట్టుబడి ఉండి పక్క రాష్ట్రంలో పార్టీ పోయినా సరే తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చి తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షను తీర్చిన తల్లి సోనియమ్మ అని అన్నారు. ఈ కార్యక్రమంలో నూతనకల్ సర్పంచ్ కరుణశ్రీ గిరిధర్ రెడ్డి సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ కృష్ణా నాయక్ ,నాయకులు లావుడియా సజ్జన్ నాయక్ ,నూతనకల్ మండలం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పసుల అశోక్ యాదవ్ ,నూతనకల్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు మూడు శంకర్ నాయక్ ,శ్రీధర్ నాయక్ , లావుడియా సీనియర్ నాయకులు, మాజీ సర్పంచులు, వార్డు మెంబర్లు , మాజీ ఎంపిటిసిలు అనుబంధ సంఘాలు, గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ అన్నీ వర్గాలకు అండ

**మిర్యాలగూడ, విశాలభారతి:** కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు భరోసా ఇచ్చే విధంగా చర్యలను చేపట్టిందని కాంగ్రెస్ మహిళ కౌన్సిలర్లు, నేతలు అన్నారు. మహాలక్ష్మి స్కీం అమలులో భాగంగా ఫ్రీ బస్ ప్రయాణ సేవలను ప్రారంభించింది. శనివారం స్థానిక ఆర్టీసీ డిపో లో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ మహిళ కౌన్సిలర్లు, నేతలు పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఫ్రీ బస్ ప్రయాణ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే ప్రజా దర్బార్ లో నేరుగా ప్రజల సమస్యలపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి రానున్న రోజుల్లో సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి పనులను చేపట్టనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కొమ్మన నాగలక్ష్మి, పందిరి అనిత, చల్లా నాగలక్ష్మి, ఇతర మహిళ నేతలు పాల్గొన్నారు.

## ఫించన్ కోసం ఆరు సంవత్సరాలుగా ఎదురుచూపు

- అర్జీ పెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో ప్రజాధర్బార్లో
- దరఖాస్తు చేసుకున్న బాలుడు

**సూర్యాపేట, విశాలభారతి:** కంటి సమస్యతో పూర్తిగా ఒక కన్ను కనిపించకపోవడంతో పింఛన్ కోసం గత ఆరు సంవత్సరాలుగా సూర్యాపేట మున్సిపాలిటీ పరిదిలోని పిల్లలమర్రి గ్రామానికి చెందిన జెర్రిపోతుల రేవంత్ గౌడ్ ప్రభుత్వానికి ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్న ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వెలిబుచ్చారు. అదికార్లు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ లో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా దర్బార్ నిర్వహించడం అందరికి ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.





## అవసరాలకు అనుగుణంగా ఆటోమేటివ్ అశోక్ లేలాండ్ ట్రక్స్

**కోదాడ, విశాల భారతి:**రవాణా రంగానికి అవసరాలకు అనుగుణంగా అన్ని రకాల మోడల్స్ లో ఆధునిక సౌకర్యాలతో ఆటోమేటిక "అశోక్ లేలాండ్ ట్రక్స్ ను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి అన్నారు. శనివారం కోదాడ మండల పరిధిలోని ద్వారకుంటలో గల అశోక్ లేలాండ్ సంస్థలో బీఎస్ సిక్స్ పేజ్ టు వాహనాల ప్రదర్శనను తెలంగాణ రాష్ట్ర లారీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రామినేని శ్రీనివాసరావు తో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అశోక్ లేలాండ్ సంస్థ అనేక ఏండ్లుగా ప్రపంచ వ్యాప్తంగా వినియోగదారులకు నాణ్యతతో కూడిన నమ్మకమైన వాహనాలను విక్రయిస్తూ అందరి ఆదరాభిమానాలు పొందిందని తెలిపారు. కాలుష్య నివారణకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నూతనంగా తీసుకువచ్చిన ఐదు రకాల మోడల్ ట్రక్కులు లారీ యజమానులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు.



## సోనియమ్మ వల్లే తెలంగాణ సాకారమైంది.

**నర్సింహులపేట,విశాలభారతి:**ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు సోనియాగాంధీ వల్లనే సాకారమైంది కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు జినుకల రమేష్ అన్నారు.నర్సింహులపేట మండల కేంద్రంలో శనివారం సోనియాగాంధీ జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు.రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుకున్నారని అందుకే ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గుచూపి భారీ మెజారిటీని కట్టబెట్టారని చెప్పారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలు సుభిక్షంగా ఉంటారని ,కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన రెండు రోజుల్లోనే రెండు గ్యారెంటీలను అమలుపరచడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెద్దనాగరం స్టేజీ సర్పంచ్ బోబ్బా సోమిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రమేష్,రామకృష్ణ, లీడర్లు తోట సురేష్, యూత్ లీడర్లు చిర్రా సతీష్, కాస యకయ్య,యాదగిరి, నిమ్మల శ్రీను పాల్గొన్నారు.



## ఘనంగా సోనియా పుట్టిన రోజు వేడుకలు

**పాలకుర్తి, విశాల భారతి:** కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సోనియా గాంధీ పుట్టిన రోజు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి ఆధ్వర్యంలో సోనియాగాంధీ బర్త్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాపాక సత్యం, గిరగాని కుమారస్వామి కేక్ కట్ చేసి కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాపాక సత్యం, గిరగాని కుమారస్వామి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన గొప్ప వ్యక్తి సోనియా గాంధీ అని అన్నారు. రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీని గుర్తు పెట్టుకొని రాష్ట్ర ప్రజలు ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారని అన్నారు. ఈ రోజు సోనియా పుట్టిన రోజును పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారని తెలిపారు. అలాగే రానున్న రోజుల్లో కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు,మండల నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు ,వార్డు మెంబర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, సోషల్ మీడియా కో ఆర్డినేటర్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు.



## ఆర్థిక సాయం చేసిన బీజేపి

**మణుగూరు, విశాల భారతి :** భారతీయ జనతా పార్టీ మణుగూరు పట్టణ శాఖ ఆధ్వర్యంలో మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని చినరాయిగూడెం గ్రామంలో గిరిజన మహిళ సబ్కా నాగమణి, వారి పిల్లలు నిద్రిస్తుండగా ఒక్కసారిగా పూరిగుడిశ ఈనెల 6 వ తారీఖున పడిన భారీ వర్షాల కారణంతెల్లవారుజామునకూలిపోయింది.ఈ విషయాన్ని గమనించిన గ్రామస్తులు కూలిన గుడిసెలో నుంచి వారిని బయటకు తీసుకువచ్చారు. ఈ విషయం తెలుసుకున్న భారతీయ జనతా పార్టీ నాయకులు బాధితురాలితో మాట్లాడి వారికి 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. సబ్కా నాగమణి పూరి గుడిస కూలీన విషయాన్ని వారు వెంటనే అధికారులు దృష్టికి తీసుకువెళ్ళారు. తక్షణమే వారికి ప్రభుత్వపరమైన సహాయ సహకారాలు అందించాలని బిజెపి నియోజకవర్గ నాయకులు పోడియం బాలరాజు, నియోజకవర్గం కన్వీనర్ పున్నం బిక్షపతి, కోరారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, కుంజ సాంబశివరావు, శ్యామల సమ్మయ్య, తెల్లం ధర్మారావు, మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



## సోమనాథుని స్ఫూర్తి భవిష్యత్తు తరానికి అందాలి

**పాలకుర్తి, విశాల భారతి:** తెలుగు సాహిత్యంలో పాల్కురికి సోమనాథుని స్ఫూర్తి ముందు తరాలకు అందించవలసిన బాధ్యత నేటి తరం సాహితీవేత్తలపై ఉందని అనంత సాహితీ వేదిక గౌరవాధ్యక్షులు నరసింహులు గుప్తా అన్నారు. ప్రముఖ సాహితీవేత్త, సోమనాథ సాహిత్య పురస్కారం గ్రహీత దోరవేటి ఆధ్వర్యంలో అనంత సాహితీ సంస్థకు చెందిన 50 మంది కవుల బృందం పాలకుర్తి, బమ్మెర, వల్మిడి, గూడూరు గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకుర్తి ప్రాంతంలో తెలుగు నేల గర్వించదగ్గ సాహితీవేత్తలు జన్మించడం ఎంతో గర్వకారణం అన్నారు. సాహితీవేత్తల బృందానికి పాలకుర్తికి చెందిన సోమనాథ కళాపీఠం అధ్యక్షులు డాక్టర్ రాపోలు సత్యనారాయణ ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో శతావధాని మలగ అంజయ్య, వడిచర్ల సత్యం, మహమ్మద్ షరీఫ్, ఆకుల మల్లికార్జున్, చిగురాల్ పల్లి ప్రసాద్, కమలేష్, బ్రహ్మం, తుల శ్రీనివాస్, అవిలేను, డాక్టర్ సాగర్ల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సోనియా జన్మదిన వేడుకలు

**నెల్లికుదురులో వేర్వేరుగా బర్త్ డే నిర్వహించిన వైనం**

**నెల్లికుదురు,విశాల భారతి:**సోనియా జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నెల్లికుదురు మండల కేంద్రంలో వేరువేరుగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షులు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్ ఆధ్వర్యంలోపార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకొని నిర్వహించగా, మాజీ జెడ్పిటిసి పార్టీ సీనియర్ నాయకులు హెచ్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విశ్రాంతి భవనంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకొని సోనియాచిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి బాణాసంచా పేల్చి ఆసుపత్రిలో రోగులకు పళ్ళు పంపిణీ చేసి జరుపుకున్నారు. ఆయా కార్యక్రమాలలో నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియాగాంధీ పుట్టినరోజు డిసెంబర్ 9 పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు హామీ ఇచ్చిన 6గ్యారెంటీలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,ఆరోగ్య శ్రీ పథకం రు.10 లక్షల పెంపు వర్తింపు అమలు చేయడం షురూ చేసినట్లు ప్రకటించారు. కార్యక్రమాలలో వైస్ ఎంపీపీవెంకటేష్, సత్యపాల్ రెడ్డి, బాలాజీ నాయక్,లక్ష్మారెడ్డి,ఉప సర్పంచ్ గొల్లపల్లి యాకయ్య గౌడ్, శ్రీపాల్ రెడ్డి,ఇట్టె దేవేందర్ రెడ్డి, మౌనేందర్,జిలకరయాలాద్రి,రత్నపురపుయాకయ్య,కొమురెల్లి,పూర్ణచందర్,దాసరి ప్రకాష్,క్రాంతి రెడ్డి,చట్ల యాకయ్య,లింగ్యా నాయక్, జగదీష్,హరీష్ వివిధ గ్రామాల పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

**రామన్నపేట, విశాల భారతి :** నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ఆదేశానుసారం రామన్నపేట పట్టణ కేంద్రంలోని సుభాష్ సెంటర్ వద్ద పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన మాజీ ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియా గాంధీ 78 వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పట్టణ ఏరియా ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేసి, కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న టిపీసీసీ మాజీ కార్యదర్శి గోదాసు పృథ్వీ రాజ్, మండల కాంగ్రెస్ నాయకులు md అక్రమ్, నాసర్, సాల్వేరు లింగం,వార్డు సభ్యులు గొలుసుల ప్రసాద్, కొమ్ముశేఖర్, కోట సుధాకర్, ఆముద లక్ష్మణ్, భూపతి నర్సింహా, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సామాన్యుడు ప్రజా సేవలో అసామాన్యుడు

**కాంగ్రెస్ జిల్లా నేత రంజిత్ రెడ్డి**

**నెల్లికుదురు విశాల భారతి:**ఆడంబరం లేకుండా ప్రజా వైద్యునిగా సామాన్య జీవితం గడుపుతూ ఏ పదవి లేకున్నా ప్రజా సేవలో ప్రజలలో మమేకమైన ప్రజా వైద్యులు డా.మురళి నాయక్ నాయక్అని కాంగ్రెస్ పార్టీ జిల్లా నేతకాసం రంజిత్ రెడ్డి అన్నారు. నూతన ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ ను హైదరాబాదులో శనివారం ఆయన కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాభిమానం చురగున్న నేత మురళీ నాయక్ అయినందునే 50 వేల మెజార్టీ పైనే సాధించారన్నారు. ఆయన విజయంతో నియోజకవర్గ ప్రజలఆత్మగౌరవంఇనుమడిస్తున్నదన్నారు. ఆయనతోపాటు రాష్ట్ర సర్పంచ్ల ఫోరం ఉపాధ్యక్షులు నత్తి మల్లేష్ తదితరులు ఉన్నారు.



# చిగురుమామిడిలో ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

**ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు..**



**చిగురుమామిడి, విశాల భారతి:** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కంది తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ 77వ జన్మదిన వేడుకలు చిగురుమండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన తల్లిగా రాష్ట్రం ఏర్పడిన తొమ్మిది సంవత్సరాల తర్వాత ఆమె జన్మదిన సందర్భంగా తెలంగాణలో ఉండిపోయేటువంటి దొరల గడిల పాలనాకు చరమగీతంపాడి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకువచ్చి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6గ్యారంటీలలో రెండు గ్యారెంటీలు మహాలక్ష్మి పథకం, ఆరోగ్యశ్రీ కింద 10లక్షల వరకు పథకలను సోనియా గాంధీ జన్మదిన సందర్భంగా అమలు చేస్తున్నట్టుగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తెలపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గీకురు రవీందర్,జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టుమల రవీందర్, అధికార ప్రతినిది దాసరి ప్రవీణ్, బీసీ సెల్ అధ్యక్షులు పొన్నం సంపత్, కిసాన్ సెల్ అధ్యక్షులు కాంతల మహిపాల్ రెడ్డి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

**దేవరుప్పుల, విశాల భారతి:** ఏఐసిసి మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను దేవరుప్పుల మండల కేంద్రంలోని జనగామసూర్యాపేట రహదారి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి గౌడ్ ఆధ్వర్యంలో సోనియాగాంధీ 78వ జన్మదినం సందర్భంగా కేక్ ను కోసి పండ్లు,మిఠాయిలు పంచిన మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీలో రెండిటినీ సోనియా గాంధీ పుట్టిన రోజు నేటి నుండి సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభించినందుకు.సంతోషం వ్యక్తం చేస్తూ సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు. అనంతరం సీతారాంపురం గ్రామంలోని అనాథ వృద్ధ శరణాలయంలో గ్రామ సర్పంచ్ రెడ్డి రాజుల రమేష్,గ్రామ శాఖ అధ్యక్షుడు వరికెల రతన్ జీ అధ్వర్యంలో వృద్ధులకు పండ్లు,అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలనాయకులు ,కార్యకర్తలు, యూత్,యువజన కాంగ్రెస్ నాయకులు,మహిళా నాయకురాల్లు,మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించిన మండల పార్టీ అధ్యక్షుడు


**పెద్ది కృష్ణమూర్తి గౌడ్**

**దేవరుప్పుల, విశాల భారతి:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారంటీలను వందరోజులలో అమలు చేయడం జరుగుతుందని చెప్పిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించి రేవంత్ రెడ్డి సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన రెండు రోజుల్లోనే శనివారం సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా ప్రకటించిన ఆరు గ్యారంటీలో రెండు గ్యారెంటీలు మహాలక్ష్మి పథకం (మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మరియు ఆరోగ్యశ్రీ 10 లక్షల) నేడు సీఎం రేవంత్ రెడ్డి అమలు చేయగా మండలంలోని పెద్దమడూరు గ్రామంలో సోనియా గాంధీ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి ఉచిత ఆర్టీ బస్సు ప్రయాణాన్ని పార్టీ శ్రేణులతో కలిసి ప్రారంభించిన మండల పార్టీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి గౌడ్ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియా గాంధీ జన్మదిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రెండు గ్యారెంటీలను అమలు చేయడం సంతోషదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు పురుషోత్తమాచారి మాజీ సర్పంచ్ బోనగిరి నరసింహ పార్టీ సీనియర్ నాయకులు ఆకవరం వెంకట్ రెడ్డి ఎంపీటీసీ అనిల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

**మణుగూరు, విశాల భారతి :** భారత జాతీయ కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు తెలంగాణ ప్రధాత తెలంగాణ తల్లి సోనియా గాంధీ 77వ పుట్టినరోజు వేడుకలు మణుగూరు మున్సిపాలిటీలోని బాపన కుంట గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు తేలే కృష్ణ ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు తేలే కృష్ణ మాట్లాడుతూ ఎందరో తెలంగాణ వీరుల విద్యార్థుల ఆత్మబలిదానాలను చూడలేక ఒక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా చనిపోతున్న కూడా తెలంగాణ ఏర్పాటు ఆవశ్యకతను గుర్తించిన సోనియమ్మ తెలంగాణను ఇవ్వడం జరిగిందన్నారు. త్యాగాల పునాదులపై ఏర్పడ్డ తెలంగాణను ఒక నియంత చేతిలో పెట్టడం వల్ల ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ రాష్ట్రం ఈరోజు అప్పులు కుప్పగా మార్చారు అని అన్నారు.



## ఇంటిలిజెంట్ ఆటోమేషన్ వర్క్ షాప్ కు అనూహ్య స్పందన

**సికింద్రాబాద్,విశాలభారతి:** హైదరాబాద్ ఇంటిలిజెంట్ ఆటోమేషన్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వ్యాపారస్తులకు ఉద్యోగులకు తెలియజేసేందుకు ప్రపంచవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఇంటిలిజెంట్ ఆటోమేషన్ కాంగ్రెస్ చైర్మన్ విన్ చెన్ జో మార్కిక అన్నారు. హైటెక్ సిటీలోనే హైటెక్ ఎగ్జిబిషన్ సెంటర్ లో నిర్వహించిన అయిన ముఖ్య అతిథిగా విచ్చేసి సెమినార్ లో ప్రసంగించారు. ఇంటిలిజెంట్ ఆటోమేషన్ వల్ల ఏర్పాటు చేస్తే రోబోలతో తక్కువ ఖర్చుతో ఎక్కువ పని చేయించవచ్చు అని తెలిపారు.ఫార్మసీ,బ్యాంకింగ్, టెలి కమ్యూనికేషన్స్, తదితర రంగాల్లో ఆటోమేషన్స్ సేవలు విస్తరిస్తున్నట్టు తెలిపారు. క్లిష్టమైన వ్యాపార సంబంధిత విషయాలను క్రోడీకరించి ,ఇంటిలిజెంట్ ఆటోమేషన్ ద్వారా డేటాను ఇతరులకు తెలియకుండా పొందుపరచవచ్చన్నారు. కొత్త కొత్త అవకాశాలను ఈ ప్రాసెసింగ్ మిషన్ ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఇంటిలిజెంట్ ఆటోమేషన్ పై , హాక్ తాన్ నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఇంటిలిజెంట్ ఆటోమేషన్ కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ క్రిస్టినా దూత,సాయి కృష్ణ మల్లం,బాట్ ట్ సిటీ,కాంగ్ ని ట్ బోట్స్ కంపెనీ ప్రతినిధులు, పాల్గొన్నారు.నిర్వహకులను ప్రత్యేకంగా అభినందించారు.



## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

**మునగాల,విశాల భారతి:** మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియా గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొప్పుల జైపాల్ రెడ్డి కేక్ కట్ చేసి మాట్లాడుతూ తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వచ్చింది అందరికీ న్యాయం జరుగుతుందని అన్నారు . తెలంగాణ 60 ఏళ్ల కల నెరవేర్చిన మన తల్లి సోనియాగాంధీకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మునగాల మండల పార్టీ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పనస విజయ్ కుమార్ ,మండల పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీనివాస్ గౌడ్ ,బీసీ సంఘం అధ్యక్షులు చింతకాయల నాగరాజు లక్ష్మయ్య, యూత్ కాంగ్రెస్ శ్రీనివాస్ రాము శర్మ, సుధాకర్ పూర్ణచంద్రరావు సతీష్ బాబా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి మండలిలో ఖమ్మం జిల్లా ప్రాధాన్యత హర్షణీయం

**ఓయూ జేఏసీ నేత కె.వెంకట్**



**సికింద్రాబాద్, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన సందర్భంగా ఖమ్మం జిల్లాకు పెద్దపీట వేసి ముగ్గురు మంత్రులను కేటాయించినటువంటి ముఖ్యమంత్రి రేవంత్ ,రాహుల్ గాంధీ, సోనియా గాంధీ ప్రియాంక గాంధీకి ధన్యవాదాలు ఓయూ జేఏసీ నేత కె.వెంకట్ కృతజ్ఞతలు చెప్పారు. ఖమ్మం జిల్లాను, యావత్ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించాలని కోరుకుంటున్నాను. ముఖ్యంగా ఖమ్మం జిల్లా వాసిగా భట్టి విక్రమార్క ( ఆర్థిక, ఇంధన శాఖ ) కి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి (వ్యవసాయం, చేనేత శాఖ) కి,తుమ్మల నాగేశ్వరావు (రెవిన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ)కి ఓయూ జాక్ కాంపాటి వెంకట్ కృతజ్ఞతలు చెప్పారు.



## ఓడినా గ్యారంటీలను నెరవేరుస్తా

**కష్టపడ్డ పార్టీ కార్యకర్తలను కడుపులో పెట్టుకొని చూసుకుంటా**

**బాల్కొండ, విశాల భారతి:** ఓడినా నియోజకవర్గంలో గ్యారంటీలను నెరవేరుస్తాను. అహర్నిశలు కష్టపడ్డ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కడుపులో పెట్టుకొని చూసుకుంటానని బాల్కొండ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్ కుమార్ అన్నారు. మెండోర మండల కేంద్రం, ముప్కాల్ మండల కేంద్రం, బుస్సాపుర్ లలో ఏఐసిసి అగ్ర నాయకురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్ని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. తల్లి సోనియమ్మ వల్లే తెలంగాణ రాష్ట్ర కల సాకారం అయ్యిందని అన్నారు. పదేళ్ల తర్వాత ప్రజలు సోనియమ్మ రుణం తీర్చుకున్నారని తెలిపారు. సోనియమ్మ పుట్టినరోజు సందర్భంగా పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ లలో రెండు పథకాలు.. మహాలక్ష్మి పథకం ద్వార ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఆసుపత్రులలో 10 లక్షల వరకు ఉచిత వైద్యం ప్రారంభం అయ్యాయని తెలిపారు.100 రోజుల్లో మిగిలిన అన్ని గ్యారంటీలను అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

**ఆర్మూర్, విశాల భారతి:** నందిపేట్ మండలంలోని మాయాపూర్, ఉమ్మెడ గ్రామలలో శనివారం కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ 77వ జన్మదినాన్ని ఘనంగా జరిపారు. జన్మదినం పురస్కరించుకొని సోనియా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ దూడ వెంకటేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీకి తెలంగాణ ప్రజలు రుణపడి ఉంటారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో సోనియా గాంధీకి బర్త్ డే గిఫ్ట్ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మోర్తాడ్ ముత్యం,మల్లు మురళి, బ్యాగరి సంజీవ్,ఈసపల్లి ముతెన్న,దూడ రమేష్,అల్లేపు గంగాధర్,అల్లేపు ముత్యం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శంకరయ్య... అను నేను..

**షాద్ నగర్ ఎమ్మెల్యేగా "వీర్లపల్లి శంకర్" ప్రమాణ స్వీకారం.**



**షాద్ నగర్,విశాల భారతి:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు శనివారం ఉదయం ప్రారంభమయ్యాయి. సభ మొదలవగానే నూతన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఓవైసి చేపట్టారు. నూతన ఎమ్మెల్యేల చేత ప్రొటెం స్పీకర్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా షాద్ నగర్ ఎమ్మెల్యే కె .శంకరయ్య అలియాస్ వీర్లపల్లి శంకర్ ప్రమాణస్వీకారం చేశారు. తొలిసారిగా శాసనసభలో వీర్లపల్లి శంకర్ అడుగుపెట్టారు. ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రమాణస్వీకారం చేశారు. ఆపై వరుసగా ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేశారు.



## సోనియా గాంధీ జన్మదిన సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమం

**తొర్రూరు, విశాల భారతి:** తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన మాజీ ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియా గాంధీ 78వ జన్మదిన వేడుకల సందర్భంగా తొర్రూరు పట్టణ కేంద్రంలోని గాంధీ సెంటర్ సమీపంలోని కూరగాయల మార్కెట్ లో కాంగ్రెస్ పార్టీ నాయకుడు గాండ్ల సంజీవ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అన్నదాన కార్యక్రమాన్ని స్థానిక కౌన్సిలర్ తూనం రోజా ప్రభుదాస్, 8 వార్డు కౌన్సిలర్ నర్సూటి గజానంద్ లు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల అకాంక్షను నెరవేర్చడానికి ఆత్మ బలిదా నాలను ఆపేందుకు, ఆనాడు కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగినప్పటికీ తెలగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన దేవత సోనియా అని కొనియాడారు. యూపీఏ అధికారంలో ఉన్న కాలంలో చైర్‌పర్సన్‌గా చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని పేర్కొన్నారు.సమాజంలోని ప్రతి పేద వారికి చదువు అందించాలని విద్యాహక్కు చట్టాలతో పాటు, మరెన్నో చారిత్రాత్మక చట్టాలను చేయడంలో సోనియమ్మ పాత్ర ఉందన్నారు. ఆమె చలువతోనే తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తూనం శ్రావణ్ కుమార్, అచ్చిరెడ్డి, ధారావత్ సోమన్న, తాళ్ల పెల్లి బిక్షం గౌడ్,అలువాల సోమయ్య,కర్ర అశోక్ రెడ్డి, కల్లూరి కుశాల్, బిజ్జాల ప్రసాద్,భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## సంప్రదాయాలను ప్రోత్సహించడం అభినందనీయం

**తొర్రూరు ఎస్సై అరుణ**

**తొర్రూరువిశాల భారతి:** భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రోత్సహిస్తూ లిటిల్ ఫ్లోర్ స్కూల్ యాజమాన్యం ట్రెడిషనల్ డే గా నిర్వహించడం అభినందనీయమని తొరూర్ ఎస్సై అరుణ అన్నారు. తొర్రూరు పట్టణ కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ట్రీడిషనల్ డే వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులచే అన్ని పండుగలను పాటలు, నృత్యాల రూపంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎస్సై అరుణ మాట్లాడుతూ సాంప్రదాయాలను ప్రదర్శించడం విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసి ప్రోత్సహించడం ప్రశంసనీయమన్నారు. కరస్పాండెంట్ అనుమాండ్ల దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ హిందూ సాంప్ర దాయాలైన తెలంగాణ పండుగలైన వినాయక చవితి ,దసరా,దీపావళి, బోనాలు,బతుకమ్మ శ్రీకృష్ణాష్టమి, సంక్రాంతి ఇతర పండుగల విశిష్టతను విద్యార్థులు తెలుసుకొనే విధంగా కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్య క్రమంలో డైరెక్టర్లు నాగిరెడ్డి,సంపత్, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు,ఉపాధ్యాయులు మమత, శోభ,రజిని,రమ, స్వాతి, స్వామిని, అరుణ, రాధిక, రోజా, చందన, శ్రమతి, గీత, రామ్మూర్తి, ఓం ప్రకాష్, శ్రీనివాస్, లింగయ్య, దిలీప్, నాగలక్ష్మి తదితరు పాల్గొన్నారు.



## కెసిఆర్ కు 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలి

**డాక్టర్ పిడమర్తి రవి.**

**సికింద్రాబాద్, విశాలభారతి:** మాజీ సీఎం కేసీఆర్ సెక్రటేరియట్, ప్రగతిభవన్ కట్టాను కానీ సొంత ఇల్లు నిర్మాణం చేసుకోలేకపోయానని ఆనడం హాస్యాస్పదం అని, ప్రజల తెలంగాణలో ప్రతి ఉద్యమకారునికి సమ న్యాయం చేయడం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందని అందులో భాగంగా కేసీఆర్ 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలనిడాక్టర్ పిడమర్తి రవి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోనియాగాంధీ 77వ జయంతి ఉత్సవాలను శనివారం ఓయూలో టీఎస్ మరియు ఓయు జేఏసీ నాయకులు రహీం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యార్థి జేఏసీ వ్యవస్థాపక చైర్మన్, తెలంగాణ రాష్ట్ర తొలి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ ఉద్యమకారులను గుర్తించి ప్రతి ఉద్యమకారానికి 250 గజాల ఇంటి స్థలాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించడానికి స్వాగతిస్తున్నామని అందుకు సంబంధించిన గైడ్లైన్స్ విడుదల కావడం ఆనందదాయకమని అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉద్యమకారులకు తీవ్రంగా అన్యాయం జరిగిందని అది దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉద్యమకారులకు సముచితస్థానం కల్పించే విధంగా తొలి అడుగు పడిందని అన్నారు.ఓయూ నూతన వసతి గృహాల నిర్మాణం కోసం యూనివర్సిటీ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీఠం వేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్, TBRS రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బొమ్మెర స్టాలిన్, గిరిజన మహాశక్తి రాష్ట్ర అధ్యక్షులు చందర్ నాయక్, ఓయూ జేఏసీ నాయకులు కాంపాటి వెంకట్, కవిత, మాదిగ జేఏసీ నాయకులు జోగు గణేష్ ,నక్క మహేష్, రేవంత్, సంతోష్‌రావు,మాల శేఖర్,సాయిబాబా, మధు, శ్రీను పాల్గొన్నారు



## ప్రమాణస్వీకారం చేసిన ఎమ్మెల్యే వేముల

**బాల్కొండ, విశాల భారతి:** బాల్కొండ నియోజకవర్గంలో హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వేముల ప్రశాంత్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం అసెంబ్లీలో ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ వేముల ప్రశాంత్ రెడ్డి చేత ప్రమాణస్వీకారం చేయించారు.

# సోనియాగాంధీకి తెలంగాణ ప్రజలు రుణపడి ఉంటారు

**ధర్పల్లి, విశాల భారతి:** ధర్పల్లి మండలంలోని కాంగ్రెస్ జాతీయ నాయకురాలు సోనియా గాంధీ 77వ జన్మదినోత్సవం పురస్కరించుకొని సోనియా గాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పూలమాలలు వేసి కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్పల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాల్ రాజ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీకి తెలంగాణ ప్రజలు రుణపడి ఉంటారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకువచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి సోనియా గాంధీకి బర్త్ డే గిఫ్ట్ ఇచ్చారని అలాగే అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు గ్యారెంటీలు అమలు చేశారని అందులో భాగంగా మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు




ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించారని మిగతా ఆరు గ్యారంటీలు 100 రోజుల్లో అమలు చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చెలిమెల నర్సయ్య, మనోహర్ రెడ్డి, మిట్టపల్లి గంగారెడ్డి,పుప్పల సుభాష్, బొక్కల బాలయ్య, మచ్చ బుచ్చన్న, వై గంగారెడ్డి, కుమ్మరి గంగా రాజ్యం, కుమ్మరి గంగాధర్,దినకర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సంస్థాన్' లో ఘనంగా సోనియా గాంధీ బర్త్‌డే

**కేక్ కట్ చేసి విషెస్ చెప్పిన కాంగ్రెస్ నాయకులు**

**సంస్థాన్ నారాయణపురం, విశాల భారతి :** సోనియా గాంధీ పుట్టిన రోజు తెలంగాణ ప్రజలకు ఒక పండుగ రోజు అని కాంగ్రెస్‌పార్టీ సంస్థాన్ నారాయణపురం మండల నాయకులు అన్నారు. శనివారం సోనియా గాంధీ 78వ బర్త్‌డే సందర్భంగా మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆమె బర్త్ డే సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు ఏపూరి సతీష్, ఎంపీపీ గుత్తా ఉమా ప్రేమ్ చంద్ రెడ్డి, మండల నాయకులు ఉప్పల లింగస్వామి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ఉక్కు సంకల్పంతో సోనియమ్మ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చారన్నారు. ప్రత్యేక రాష్ట్రాన్ని సాకారం చేసిన సోనియమ్మకు రుణపడి ఉంటామని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి , పండ్లు పంపిణీ చేసి సోనియా గాంధీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ముక్కన బాలకృష్ణ, పగిళ్ల శేఖర్, భిక్షపతి నాయక్, కుక్కల నరసింహ తదితరులు పాల్గొన్నారు.



## మహిళలకు ఉచిత ప్రయాణం హర్షణీయం

**మందమర్రి టౌన్, విశాల భారతి:** తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన సోనియా గాంధీ జన్మదిన వేడుకలను మందమర్రి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. శనివారం యూత్ కాంగ్రెస్ వారియర్స్ ఆధ్వర్యంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మందమర్రి పట్టణంలో కేక్ కట్ చేసి, పేదలకు పళ్ళు పంచి పుట్టిన రోజు వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాయబారపు కిరణ్ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మొదటిసారి సోనియా గాంధీ పుట్టిన రోజును పురస్కరించుకుని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 6 గ్యారంటీల పథకంలో భాగంగా మహాలక్ష్మి పథకం కింద మొదటిది మహిళలకు రాష్ట్రంలో ఉచిత ప్రయాణం, రెండోది చేయూత పథకం కింద రాజీవ్ ఆరోగ్యశ్రీ భీమా 10 లక్షలు పెంచుతూ తక్షణం అమల్లోకి తీసుకురావడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ వారియర్స్ సుజిత్, సాగర్, అన్వేష్, విజయ్, రవికిరణ్, సాత్విక్, రాజ్ కుమార్, అర్జున్, ప్రేమ్ సాయి, అంజి, రాజు, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత బస్సు కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**నార్కట్ పల్లి,విశాలభారతి:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాల్లో భాగంగా మహాలక్ష్మి ఉచిత బస్సు కార్యక్రమాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా నార్కట్ పల్లి డిపో లో జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సోనియా జన్మదినం రోజునే తెలంగాణ ప్రకటన వచ్చిందని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని అన్నారు. తెలంగాణ ఇచ్చిన నిజమైన తెలంగాణ తల్లి సోనియా గాంధీ అన్నారు. కార్యకర్తల త్యాగం, కష్టంతోనే తెలంగాణలో అధికారంలోకి వచ్చామన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి ఎన్ని రాజకీయ ఒడిదొడుకులు ఎదుర్కొన్నా రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ దే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇవాళ ఆరు గ్యారంటీలలో రెండు గ్యారంటీలను అమలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుందని ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10లక్షల వరకు ప్రజలకు ఉచిత వైద్యం, మహిళలకి రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచిత ప్రయాణం లని అమలు చేసిందని అన్నారు. తెలంగాణను సంక్షేమ రాజ్యంగా మార్పు చెందుతని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య,చిట్యాల మున్సిపాలిటీ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి, ఎల్లంకి ఎంపీటీసీ తిమ్మాపురం మహేందర్ రెడ్డి,గుడిపాటి లక్ష్మీ నరసింహ, కాటం వెంకటేశం, మాజీ జెడ్పిటిసిలు దూదిమెట్ల సత్తయ్య, అలుగుబెల్లి రవీందర్ రెడ్డి, డిపో మేనేజర్, వివిధ హోదాలలో ఉన్న నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం

**బాల్కొండ, విశాల భారతి:** సోనియా గాంధీ 77వ పుట్టినరోజును నియోజకవర్గంలోని భీమ్‌గల్ మండలం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆమె చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా భీమ్‌గల్ మండల అధ్యక్షుడు బొదిరే స్వామి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ రెండు రోజుల్లోనే మొదటి హామీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రెండవ హామీ రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్ ఆసుపత్రిలో పది లక్షల వరకు ఆరోగ్యశ్రీ ఉచిత వైద్య సదుపాయం సోనియా గాంధీ పుట్టినరోజున రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఈ సదుపాయాలను ప్రజలందరూ ఉపయోగించుకొని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్



పార్టీని ఆదరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భీమ్‌గల్ పట్టణ అధ్యక్షుడు జె.జె నర్సయ్య, బాల్కొండ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేంద్రబాబు, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు వాక మహేష్, కార్యదర్శి చరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## సమస్యలపై పోరాడుతున్న సిఐటియునే గెలిపించండి

**మందమర్రి టౌన్, విశాల భారతి:** నిరంతరం కార్మిక సమస్యలపై పోరాడుతూ, కార్మికులను కార్మిక సంఘాలను కలుపుకొని పోయే సీఐటీయూ లాంటి సంఘాన్ని గెలిపించాలని కార్మికులను సీఐటీయూ నాయకులు కోరారు. శనివారం కేకే ఓసీపిలో పిట్ సెక్రటరీ మేడి రాజమల్లు ఏర్పాటు చేసిన ద్వారా సమావేశానికి సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు డిప్యూటీ జనరల్ సెక్రటరీ నాగరాజు గోపాల్ మాట్లాడుతూ ఏరియాలో గెలిచామని చెప్పుకొని కార్మిక సమస్యలపై మాట్లాడాల్సిన రెండు సంఘాలు మౌనం పాటించారు. మాట్లాడే స్థానం లేనప్పటికీ కార్మికుల ప్రతి సమస్య పైన నిరంతరం పోరాడుతున్న సిఐటియు సూర్యుని గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కార్మికులను కోరారు. ఇప్పటికే అన్ని యూనియన్లు కలిసి అగ్రిమెంట్ చేసిన మారు పేర్లు మైనింగ్ సిబ్బంది ట్రేడ్స్ మెన్స్, ఈ పి ఆపరేటర్లకు సర్ఫేస్లో అదే డెసిగ్నేషన్ ఇవ్వాలన్న అగ్రిమెంట్లను అమలు చేయించడంలో గెలిచిన సంఘాలు విఫలమయ్యాయనీ అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పిట్ సెక్రటరీ మహమ్మద్ అరిఫ్, బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు వెంకటస్వామి, అల్లి రాజేందర్, ఉపాధ్యక్షులు రామగిరి రామస్వామి, వడ్లకొండ ఐలయ్య ఆర్గనైజర్ జడల ప్రవీణ్, ఓసి కార్మికులు పాల్గొన్నారు.



## పొంగులేటికి శుభాకాంక్షలు తెలిపిన సాంసంగ్ రాజు దంపతులు.

**విశాలభారతి,కంటోన్మెంట్:** తమ అభిమాన నేతల కోసం అభిమానులు ఎంతటి త్యాగానికైనా సిద్ధమవుతారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పాలేరులో పోటీ చేయడం లేదు అంటూ వైయస్సార్ టిడిపి రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల స్పష్టం చేసిన విషయం అందరికీ తెలిసిందే కాగా,తమ అభిమాన నేత గెలవాలని కోరుతూ పూజలు వ్రతాలు, హోమాలు యాగాలు ఇలా ఎన్నో చేయడం చూసుంటాం. కానీ ఖమ్మం జిల్లాలో పేరుగాంచిన నేత గెలవాలని ఆయన అభిమాని ఏకంగా 41 రోజుల ఉపవాస ప్రార్థన చేపట్టారు. తనతో పాటు తన సతీమణి కూడా ఈ సృష్టికర్తకు ఉపవాసం ఉండి ప్రార్థన చేసిన సంగతి ఆలస్యంగా వెలుగు చూసింది. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎన్నికల్లో గెలవాలని కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన సాంసంగ్ రాజు కుటుంబం ఉపవాస దీక్షను పూనుకొని, ఆయన గెలుపు తర్వాత విరమించుకున్నారు.ఎన్నికల్లో గెలిచిన ఆయన ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయడమే కాకా ఏకంగా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడానికి చూసిన ఆ అభిమానులు తబ్బిబ్బిపోయారు, వారి ఆనందానికి అవధులే లేవు. తన తమ అభిమాన నేత మంత్రి పదవి దక్కించుకోవడంతో నేరుగా తన ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపి పూలగుచ్చాలిచ్చి, చాలువాతో సత్కారం చేసి స్వీట్లు పంచుకునే సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో సామ్సన్ రాజు దంపతులు,రవి పొంగులేటి అభిమానులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు




## అర్హులందరికీ ఆరోగ్యశ్రీ

**చేయూత పథకాలను ప్రారంభించిన కలెక్టర్ భారతి హోళికేరి**

శేరిలింగంపల్లి,విశాలభారతి: శేరిలింగంపల్లిలోని కొండాపూర్ ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో రెండు గ్యారంటీ పథకాలలో భాగంగా శనివారం రాజీవ్ పథకాన్ని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భారతి హోళీకేరి ముఖ్య అతిథిగా హాజరై మహాలక్ష్మి, చేయూత,కార్యక్రమలను ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ భారతి హోళీకేరి మాట్లాడుతూ,ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా తీసుకున్న పథకాల్లో కేవలం రెండు రోజుల్లో రెండు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు.ఆరోగ్యం విషయంలో గతంలో ప్రతి కుటుంబనికి 5లక్షల పరిమితి ఉండేదని, ప్రస్తుతం దాన్ని 10 లక్షలకు పెంచడం జరిగిందన్నారు.అన్ని రకాల వైద్యసేవలు,డయాలసిస్ కూడా అందుబాటులో ఉంటుందన్నారు,మహాలక్ష్మి కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులో తెచ్చామని తెలిపారు. ప్రతి మహిళ తమ ఐడి కార్డు ఇతర గుర్తింపు కార్డులు చూపించి జీరో టికెట్ తీసుకొని తెలంగాణ రాష్టంలో ఎక్కడైనా ప్రయాణం చేయొచ్చని తెలిపారు. ఇది కేవలం తెలంగాణ మహిళలకు మాత్రమే ఈ మహాలక్ష్మి వర్తిస్తుందన్నారు,సిటీ ఆర్డినరీ, మెట్రో, పల్లె వెలుగు బస్సులలో ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు ఆస్పత్రి సిబ్బంది డాక్టర్లు అధికారులు, ఆర్టీసి సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

**సోనియాగాంధీ జన్మదినం రోజున చారిత్రాత్మకమైన రోజు**

**చిట్యాల,విశాలభారతి:** తెలంగాణ రాష్ట్రానికి చారిత్రాత్మకమైన రోజు సోనియా గాంధీ జన్మదినం అని చిట్యాల మున్సిపాలిటీ చైర్మన్ కోమటిరెడ్డి ఇచ్చిన వెంకటరెడ్డి అన్నారు. సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా చిట్యాల పట్టణంలోని కనకదుర్గ గుడి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మున్సిపాలిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన ఘనత సోనియాగాంధీ కుటుంబానిధని అన్నారు. తెలంగాణ ప్రకటన చేసిన రోజు సోనియాగాంధీ జన్మదినం ఒకే రోజు కావడం చారిత్రాత్మకమని అన్నారు. తెలంగాణ వచ్చిన తరువాత కూడా దశాబ్ద కాలం ఎదురు చూడాల్సి వచ్చిందని మార్పు కోసం రాష్ట్ర ప్రజలు అద్భుత తీర్పు ఇచ్చారని 60 ఏళ్ల ఆకాంక్షను సోనియాగాంధీ సాకారం చేశారన్నారు. సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఆరోగ్యశ్రీ పథకం 10లక్షల పరిమితికి పెంచడం చేసిందని మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను కచ్చితంగా నెరవేరుస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హ్యాంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యే వేముల వీరేశం సారథ్యంలో నకిరేకల్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పోకల దేవదాసు, మండల అధ్యక్షులు గుడిపాటి లక్ష్మీనరసింహ, మాజీ మార్కెట్ చైర్మన్ కాటం వెంకటేశం,పట్టణ అధ్యక్షులు జడల చిన్న మల్లయ్య, మాజీ జెడ్పిటిసి శేపూరి యాదయ్య, రేముడాల లింగస్వామి, ఎద్దులపూరి కృష్ణ,ఏనుగు అంజిరెడ్డి, బట్టు ఐలేష్, కోమటిరెడ్డి రామిరెడ్డి, శేపూరి మారయ్య, జిట్టా చంద్రకాంత్, ఇబ్రహీం, సాగర్ల గోవర్ధన్, ఎల్ల మల్లేష్,చెరుకుపల్లి శ్రీశైలం, బొబ్బలి రామ్ రెడ్డి, జంపాల వెంకన్న, రేముడల మధు, పోకల యేసు,పాల శివ, ,జిట్ట చిన్నస్వామి,దేశపాక రాజేష్, కోమిడాల నర్సిరెడ్డి, జిట్టా బిక్షం, దామనురి సైదులు, గంగాపురం గణేష్, ఎండి ముబీన్, నూనె శ్రీకాంత్,కుక్కల దిలీప్.(టిల్లు), తాండూరు చంద్రం, గొంగ్ర మహేందర్ రెడ్డి,ఎడ్ల మహాలింగం, గాలి యాదగిరి, నూనె శ్రీను, రేముడల యాదయ్య,ఎస్కే కరీం, మరియు వివిధ గ్రామాల సర్పంచులు , ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సోనియా గాంధీ 77వ జన్మదిన వేడుకలు.

- హాజరైన మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి
- టీపీసీసీ ఉపాధ్యక్షులు మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్

**బోడుప్పల్ ,విశాలభారతి:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు పోగుల నరసింహా రెడ్డి. ఆద్వర్యంలో బోడుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా సోనియా గాంధీ 77వ జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగింది . మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి సమక్షంలో కేక్ కట్ చేశారు. అనంతరం వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాకారం చేసిన సోనియా గాంధీకి రుణపడి ఉంటామని ప్రజాసంక్షేమమే లక్ష్యం గా పని చేస్తాం అని అన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రధాన కార్యదర్శిలు,కార్పొరేటర్లు, కంటెస్టెంట్ కార్పొరేటర్లు,బీసీ సెల్ s.c సెల్, మైనారిటీ సెల్, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## అమ్మ ఇచ్చిన మాట... అధికారంలోకి రాగానే నెరవేర్చిన అన్న.

- మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం.
- స్త్రీ,శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్ పర్సన్ తాండ్ర విశాలశ్రవణ్ రెడ్డి.

**షాద్ నగర్,విశాలభారతి:** ఎన్నికల ముందు ఆర్ గ్యారెంటీల రూపంలో సోనియమ్మ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాటలో అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్ అన్న రెండు గ్యారెంటీలను అమలు చేయడం ద్వారా ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని స్త్రీ,శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్ పర్సన్,కేశంపేట జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల్లో ఒకటైన మహాలక్ష్మి,అలాగే ఆరోగ్యశ్రీ 10 లక్షల వరకు పెంపు వంటి రెండు పథకాలను సోనియా గాంధీ పుట్టిన రోజైన శనివారం ప్రారంభించడం సంతోషాన్ని కలిగించిందన్నారు.మహాలక్ష్మి పథకం విధివిధానాల పై తెలంగాణ ప్రభుత్వం జీవో విడుదల చేసింది.తెలంగాణకు చెందిన మహిళలు,ఆడపిల్లలు,ట్రాన్స్ జెండర్లు ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రమంతా ఉచితంగా ప్రయాణించవచ్చని పేర్కొంది.ఈపథకం ద్వారా పల్లెవెలుగు,ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మహిళా ప్రయాణికుల ఛార్జి మొత్తాన్ని ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించనున్నట్లు ఆమె తెలిపారు.







# సోనియమ్మ జన్మదినం తెలంగాణ ప్రజలకు ఒక పండుగ దినం.

- కాంగ్రెస్ గెలుపుతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారు.
- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.

**షాద్ నగర్,విశాలభారతి:** సోనియా గాంధీ జన్మదినం తెలంగాణ ప్రజలకు ఒక పండుగ దినం అని,డిసెంబర్ 9, 2009లో తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ మొదలైందని,ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తట్టుకుని ఉక్కు సంకల్పంతో సోనియమ్మ మన ఆకాంక్షలు నెరవేర్చారని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. తెలంగాణ తల్లి ఎలా ఉంటుందో మనం చూడలేదు.తెలంగాణ తల్లి సోనియమ్మ రూపంలో ఉంటుందని ఆ తల్లి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇవ్వడం ద్వారా మనకు భరోసా ఇచ్చిందని, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు పట్టం కట్టి తెలంగాణ ప్రజలు ఆమె రుణం తీర్చుకున్నారని ఆయన స్పష్టం చేశారు. శనివారం సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దంపతులు కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే నివాసం వద్ద పేద ప్రజలకు దంపతులిద్దరూ చీరలను పంపిణీ చేశారు. అంతేకాకుండా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళలకు, గర్భిణులకు పండ్లు, బ్రెడ్ లను పంపించేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ సోనియా గాంధీ జన్మదిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. సోనియాగాంధీ జన్మదినం రోజునే తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఉచితంగా 10 లక్షల రూపాయల వైద్య సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపుతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని ప్రజామోదమైన జనరంజక పాలన తెలంగాణలో కొనసాగుతుందన్నారు. అవినీతి అక్రమాలకు తావులేకుండా ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ అహర్నిశలు కృషి చేస్తుందని అన్నారు. ప్రజల దీవెనలతో తల్లి సోనియమ్మ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో విరాజిల్లుతుందని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# మహిళల ఉచిత బస్సు ప్రయాణాన్ని జెండా ఊపి ప్రారంభం

- టీపీసీసీఉపాధ్యక్షులు,మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్.

**మేడిపల్లి,విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీ పథకాల్లో ఒకటైన మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ పథకాన్ని ఈరోజు మేడ్చల్ నియోజకవర్గం ఉప్పల్ బస్సు డిపో, తూముకుంట బస్సు స్టాండ్, వద్ద కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు నక్కా ప్రభాకర్ గౌడ్ నాయకులతో కలిసి మహిళలకు స్వీట్లు పంపిణీ చేసి జెండా ఊపి ఉచిత ప్రయాణాన్ని ప్రారంభించారు. అనంతరం వారితో పాటు బస్సు లో ప్రయాణించారు.ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే తప్పనిదని ఇచ్చిన 6 గ్యారంటీ పథకాలు 100 రోజులు అమలు చేస్తామని చెప్పి కేవలం రెండు రోజే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధికి నిదర్శనమని వారు పేర్కొన్నారు. అదే విధంగా ఆరోగ్యశ్రీ పథకం కింద నిరుపేదలకు 10 లక్షల రూపాయలు పెంచుతూ అన్ని ఆసుపత్రులకు ఆదేశాలు జారీ చేయడం మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. మిగిలిన గార్యంటీ పథకాలను కూడా రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తుందన్నారు.ఈ కార్యక్రమం లో మేడ్చల్ నియోజకవర్గం ఏ బి బ్లాక్ అధ్యక్షులు, మండల్ మున్సిపల్, కార్పొరేషన్ అధ్యక్షులు,సీనియర్ నాయకులు,వైస్ ఎంపీపీ,సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, కంటెస్టెడ్ కౌన్సిలర్లు కార్పొరేటర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, s.c సెల్, బీసీ సెల్, మైనారిటీ సెల్, సేవ దళ్, s.t సెల్, NSUI, నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రపంచ మానవ హక్కుల దినోత్సవ అవగాహన

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** జీవించే హక్కు జన్మత లభించేది,మిగతావన్నీ రాజ్యాంగ పరంగా లభించేవని ఆచార్య అఫ్రోజ్ ఆలం అన్నారు.ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో శనివారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని సఫారీ నగర్ లోని న్యూ బ్లూమ్ హై స్కూల్ లో విద్యార్థినీ,విద్యార్థులకు మానవ హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర ఆచార్యులు అఫ్రోజ్ ఆలం హాజరై మాట్లాడుతూ రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అనేక సోషలిస్టు, ప్రజాస్వామ్య దేశాల ఆవిర్భావం జరిగిందన్నారు. వివిధ దేశాల లోపల, బయటా కూడా మానవ హక్కుల 'హననం' జరుగుతూనే ఉందన్నారు.శాస్త్ర, సాంకేతికంగాఎంతో అభివృద్ధి చెందిన ఈ ఆధునిక యుగంలోనూ నిరంకుశ పాలకులు,ప్రభుత్వాలు తమ ప్రజల మానవ,హక్కులను హరించడం పరిపాటిగా మారిందని తెలిపారు.ఈ విధమైన దురాగతాలను అరికట్టి మానవ హక్కుల సంరక్షణకు భారత స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ హన్స జీవరాజ్ మెహతాతో పాటు వివిధ దేశాల సైద్ధాంతిక భావజాలాలకు చెందిన మేధావులంతా కలిసి ఒక ప్రకటనను రూపొందించారు. ఈ ప్రకటనను, ఐక్యరాజ్యసమితి 1948 డిసెంబరు 10న ఆమోదించి ప్రతి సంవత్సరం డిసెంబరు 10 న ఒక అంశాన్ని ప్రాధాన్యంగా తీసుకుని నిర్వహిస్తూ ఉన్నదని ఈ సంవత్సరం నినాదం 'అందరికి స్వేచ్ఛ, సమానత్వం,న్యాయము ని పేర్కొన్నారు.ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల ప్రకటన భారతదేశంతో సహా పలు దేశాల రాజ్యాంగాలకు స్పూర్తినిస్తుందని,సమాజంలో కొంతమంది ఇంకా జాతి, కులము,మతము జాడ్యాలను పట్టుకొని వ్రేలాడుతున్నారన్నారు. సమాజంలో మానవ హక్కుల ఉల్లంఘన జరిగినపుడు పౌర సమాజం చైతన్యమై మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిరణ్, అధ్యాపకులు మరియు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు విష్ణుప్రసాద్, శివరామకృష్ణ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



నకిరేకల్ ఎమ్మెల్యేగా ఎన్నికైన వేముల వీరేశం ని చిట్యాల మండల నాయకులు మారవు ఆంజనేయులు, ఏర్పుల పరమేష్, కోనేటి కృష్ణ, కుక్కల మోహన్ లు ఎమ్మెల్యే క్వార్టర్స్ లో కలిసి శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు.



యశోద హాస్పటల్ లో చికిత్స పొందుతున్న తెలంగాణ రాష్ట్ర మాజీ సీఎం కేసీఆర్ ని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కలిశారు. కేసీఅర్ త్వరగా కోలుకోవాలని భగవంతుడి ఆశీస్సులు కేసీఆర్ పై ఉంటాయని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తో నియోజకవర్గ పరిస్థితులపై చర్చించారు.

# ఎమ్మెల్యేగా ప్రమాణ చేసిన లాస్య నందిత.



**విశాలభారతి,కంటోన్మెంట్ :** లాస్యనందిత అనే నేను...సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన జి. లాస్యనందిత ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేశారు. ప్రొటెం స్పీకర్ అక్బర్ ఉద్దీన్ సమక్షంలో ఎమ్మెల్యే ప్రమాణాస్వీకారం చేశారు. అసెంబ్లీ వేదికగా లాస్యనందిత ప్రమాణ స్వీకారం చేసే సమయంలో తన తండ్రి సాయన్నను గుర్తు చేసుకున్నారు. ఆంగ్లంలో ప్రమాణం చేసిన అనంతరం ఆమెను ప్రొటెం స్పీకర్ అక్బర్ఉద్దీన్ అభినందించారు.ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారానికి ముందే బీఆర్ఎస్ఎల్పీ మీటింగ్ లో పాల్గొన్నారు. తెలంగాణ భవన్ లో జరిగిన ఎల్పీ మీటింగ్ లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన పలువురు ఎమ్మెల్యేలతో పాల్గొన్నారు. అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అందరు కలిసి గన్ పార్కుకు చేరుకొని అమరవీరులకు ఘననివాళి అర్పించారు.అక్కడి నుంచి అసెంబ్లీ కి చేరుకున్నారు.

# ఓయూ లో ఘనంగా సోనియాగాంధీ పుట్టిన రోజు వేడుకలు

**హాలవత్ మోహన్ నాయక్ ఆధ్వర్యంలో**



**సికింద్రాబాద్ విశాలభారతి:** కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు హలావత్ మోహన్ నాయక్ ఆధ్వర్యంలో శనివారం నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన తల్లి సోనియమ్మ ఓయూలో ఆర్ట్స్ కళాశాల వేదికగా ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ , మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య హాజరై మాట్లాడుతూ. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ,అమరవీరుల త్యాగాలను, ఉద్యమకారుల ఆరాటాన్ని ,పోరాటాన్ని చూసిన తెలంగాణ తల్లి సోనియమ్మ ఆంధ్ర పాలకుల పెత్తనంలో తెలంగాణ ప్రజలు బంధీలైన విషయాన్ని గమనించి తెలంగాణ ప్రజలకు రాజకీయపరమైన స్వేచ్ఛనివ్వాలని పూనుకొని డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం అవుతుందని మొదలైన ప్రక్రియ ఫిబ్రవరి 10 నాటికి తెలంగాణ రాష్ట్ర సహకారంలో తన వంతు పూర్తి సహకారాన్ని అందించిన సోనియమ్మకు తెలంగాణ ప్రజలు రుణపడి ఉన్నారని అందులో భాగంగానే ఆర్ట్స్ కళాశాల వేదికగా జరుగుతున్న జన్మదిన వేడుకల్లో పాల్గొనడం జరిగిందని నేడు ప్రజా కంటక పాలన నిరంకుశ పాలనకు అంతం చేసి సోనియమ్మ ఇచ్చింది తెలంగాణ వచ్చిందని నినాదంతో నేడు రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రజా పాలన మొదలైందని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలను నెరవేర్చుకుంటూ ప్రజలకు ఇందిరమ్మ రాజ్యాన్ని అందించడానికి కాంగ్రెస్ పార్టీ మరియు నాయకులుగా మేమందరం కష్టపడి పనిచేసి ప్రజల సమస్యలు డిమాండ్లు తీర్చడంలో ప్రజాక్షేత్రంలో ఉంటామని తెలియజేశారు.



**నరసింహ ఆధ్వర్యంలో చీరెలా పంపిణీ**

సోనియాగాంధీ జన్మదిన సందర్భంగా ఓయూ వలిగొండ నరసింహ, నల్లా లతావిశ్వజన్,ఎన్ పద్మ యాదవ్ మరియు కొండారెడ్డి పల్లి శేఖర్ ఆధ్వర్యంలో యూనివర్సిటీలోని మహిళా వర్కర్స్ కి చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యూ నాయకులు తేజావత్ వెంకట్ నాయక్, ఈరెంటి విజయ్ మాదిగ రవితేజ ,ఈశ్వర్ లాల్, విజయ్ నాయక్ ,కరణ్ , నగేష్, మోహన్ నాయక్. భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 60 ఏళ్ల ఆకాంక్షను నెరవేర్చిన సోనియా గాంధీ కి మరియు నియంత పరిపాలనపై అలుపెరుగని పోరాటం చేసి తెలంగాణ ప్రజా ప్రభుత్వ ఏర్పాట్లో ముఖ్య భూమిక పోషించి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్ రెడ్డి కి యావత్ తెలంగాణ విద్యార్థి నిరుద్యోగుల పక్షాన శుభాకాంక్షలు చెప్పారు. ఈ ప్రజాప్రభుత్వంలో నిరుద్యోగుల పక్షాన ఉద్యోగ నియామకాలు సకాలంలో పూర్తిచేసి,యూనివర్సిటీలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలు త్వరిత గతిన చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మోహన్ నాయక్, కొర్ర ఈశ్వర్ లాల్, ఎన్ఎస్ఈఐ రాష్ట్ర కార్యదర్శి తేజావత్ వెంకట్ ,డా.బాలు నాయక్, ఇంజనీరింగ్ స్కాలర్ రవీందర్ నాయక్, చంద్రశేఖర్ , బాబు నాయక్, బాలాజీ, నవీన్ ,వికాస్, బద్రు, కరణ్, విజయ్, పాల్గొన్నారు.

# సౌతాఫ్రికాతో సమరానికి టీమిండియా సై

- ఆదివారం తొలి మ్యాచ్‌తో టీ20 సిరీస్ ప్రారంభం
- జట్టులో చేరిన గిల్, జడేజా, సిరాజ్, కుల్దీప్



సౌతాఫ్రికా పర్యటనకు వెళ్లిన టీమిండియా తొలి పోరుకు సిద్దమైంది. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగే తొలి మ్యాచ్‌లో ఆతిథ్య సౌతాఫ్రికాతో తలపడనుంది. సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో జరిగిన ఐదు టీ20ల సిరీస్‌ను 41తో గెలుచుకున్న టీమిండియా.. సఫారీ గడ్డపై అదే జోరును కొనసాగించాలనుకుంటోంది. ఇప్పటికే సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని టీమిండియా సఫారీ గడ్డపై అడుగుపెట్టి ప్రాక్టీస్ మొదలుపెట్టింది. ఈ పర్యటనలోని పరిమిత ఓవర్ల సిరీస్‌లకు సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, మహమ్మద్ షమీ, జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా దూరంగా ఉన్నారు. వన్డే ప్రపంచకప్ అనంతరం రెస్ట్ తీసుకున్న శుభ్‌మన్ గిల్, రవీంద్ర జడేజా, మహమ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్ రీఎంట్రీ ఇచ్చారు. టీమిండియా తుది జట్టు ఎంపిక హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌కు తలనొప్పిగా మారింది. శ్రేయస్ అయ్యర్ జట్టులోకి రావడంతో తిలక్ వర్మను బెంచ్‌కే పరిమితం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఓపెనింగ్ స్లాట్‌తో పాటు మిడిలార్డర్‌లో చోటు లేకపోవడంతో ఇషాన్ కిషన్‌ను ఆడించే విషయంలో డైలమాలో ఉంది టీమ్ మేనెజ్‌మెంట్. అయితే వికెట్ కీపర్‌గా అతనికి తొలి ప్రాధాన్యత ఇస్తేనే ఇషాన్ కిషన్ తుది జట్టులో కొనసాగుతాడు. ఓపెనర్‌గా ఆడించాలనుకున్నా.. ఇషాన్ కిషన్‌కు చోటు దక్కుతుంది. మరోవైపు ఆసీస్‌తో జరిగిన చివరి రెండు టీ20ల్లో జితేశ్ శర్మ సత్తా చాటాడు. మెరుపు ఇన్నింగ్స్ లు ఆడాడు.

వన్డే ప్రపంచకప్ తర్వాత జట్టులోకి రీఎంట్రీ ఇస్తున్న శుభ్‌మన్ గిల్ ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నాడు. అతనికి తోడుగా యశస్వీ జైస్వాల్ ఆడనున్నాడు. దీంతో రుతురాజ్ గైక్వాడ్ బెంచ్‌కే పరిమితం కావాల్సి ఉంటుంది. మూడు, నాలుగు స్థానాల్లో శ్రేయస్ అయ్యర్, సూర్యకుమార్ యాదవ్ ఆడనున్నారు. ఐదో స్థానంలో వికెట్ కీపర్ బ్యాటర్లైన జితేశ్ శర్మ, ఇషాన్ కిషన్ లలో ఒకరికి మాత్రమే అవకాశముంటుంది. ఆరో స్థానంలో రింకూ సింగ్ బ్యాటింగ్ చేయనుండగా.. ఏడో స్థానంలో రవీంద్ర జడేజా బరిలోకి దిగనున్నాడు. Also Read Yatra2: సీఎం జగన్ సతీమణి భారతిరెడ్డి స్పెషల్ పోస్టర్.! స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్, రవి బిష్ణోయ్‌ల మధ్య పోటీ నెలకొంది. ఈ ఇద్దరిలో ఒకరికి చోటు దక్కనుంది. బ్యాటింగ్ చేయగల సామర్థ్యం ఉన్న రవి బిష్ణోయ్‌కే చోటు దక్కవచ్చు. పేస్ విభాగాన్ని మహమ్మద్ సిరాజ్ లీడ్ చేయనున్నాడు. అర్ష్ దీప్ సింగ్, ముకేష్ కుమార్‌లతో సిరాజ్ పేస్ బాధ్యతలను పంచుకోనున్నాడు. భారత తుది జట్టు (అంచనా): శుభ్‌మన్ గిల్, యశస్వీ జైస్వాల్, ఇషాన్ కిషన్/జితేశ్ శర్మ, శ్రేయస్ అయ్యర్, సూర్యకుమార్ యాదవ్, రింకూ సింగ్, రవీంద్ర జడేజా, రవి బిష్ణోయ్/కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ముఖేష్ కుమార్, మహమ్మద్ సిరాజ్

# కొడుకు వల్లే రిటైర్ అయ్యా: ఏబీడి ఆసక్తికర వ్యాఖ్యలు



వరల్డ్ క్రికెట్ లో సౌతాఫ్రికా టీమ్ కు ఓ చరిత్ర ఉంటే.. అందులో ఒక పేజీ మిస్టర్ 360 ఏబీ డివిలియర్స్‌కి ఉంటుంది. ప్రపంచ క్రికెట్‌లో దాదాపు 14 ఏళ్లకు పైగా తన ఆటతో అభిమానులను అలరిస్తూ సౌతాఫ్రికాకు అద్భుతమైన విజయాలను అందించాడు. మైదానానికి నలువైపులా షాట్లు ఆడుతూ మిస్టర్ 360గా పేరుతెచ్చుకున్న డివిలియర్స్.. 2018లో అంతర్జాతీయ క్రికెట్ కు గుడ్ బై చెప్పాడు. కెరీర్ మంచి ఊపులో ఉన్న దశలోనే ఆటకు వీడ్కోలు పలికి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. ఏబీడీ నిర్ణయంతో యావత్ క్రికెట్ ప్రపంచం ఒక్కసారిగా షాక్‌కు గురైంది. ముఖ్యంగా ఒక్క ప్రపంచకప్ టోర్నీ కూడా గెలవకుండానే ఏబీడీ కెరీర్‌ను ముగించాడని ఫ్యాన్స్ బాధ పడ్డారు. అయితే అనూహ్యంగా 34 ఏళ్లకే అంతర్జాతీయ క్రికెట్‌కు ఎందుకు వీడ్కోలు పలకాల్సి వచ్చిందో తాజాగా వెల్లడించాడు ఏబీడీ.

వాస్తవానికి డివిలియర్స్ 2018లో రిటైర్మెంట్ పలికేటప్పుడు.. కుటుంబంతో గడిపేందుకు సమయం కోసమే.. ఆటకు దూరమైనట్లు వెల్లడించాడు. కానీ, అసలు విషయం అది కాదని తాజాగా చెప్పుకొచ్చాడు. "నా చిన్న కొడుకు అనుకోకుండా తన్నడంతో నా ఎడమ కంటికి దెబ్బ తగిలింది. దీంతో నా దృష్టి లోపించింది. ఆ తర్వాత ఆపరేషన్ కూడా చేయించుకున్నా. దీని తర్వాత ఆటకు దూరంగా ఉండమని డాక్టర్ నాకు సజెస్ట్ చేశారు. అపుడు డాక్టర్ ఓ ప్రశ్న సైతం అడిగాడు. ఒకే కన్ను కనిపిస్తున్నా.. క్రికెట్ ఎలా ఆడారు అని.. కానీ లక్కీగా నా ఇంకో కన్ను చాలా క్లియర్‌గా కనిపించింది. అందుకే రెండేళ్ల పాటు ఐపీఎల్ సహా ఇతర లీగ్‌లలో ఆడాను" అని ఓ స్పోర్ట్స్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఏబీడీ వెల్లడించాడు. సౌతాఫ్రికా తరఫున 114 టెస్టులు, 228 వన్డేలు, 78 టీ20 మ్యాచుల్లో ప్రాతినిధ్యం వహించాడు ఏబీ డివిలియర్స్. టెస్టుల్లో 8,765 పరుగులు, వన్డేల్లో 9577, టీ20ల్లో 1672 రన్స్ స్కోరు చేశాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో 184 మ్యాచులు ఆడి.. 5,162 రన్స్ చేశాడు ఏబీడీ. ఐపీఎల్‌లో 2021 లో చివరి మ్యాచ్ ఆడాడు.